


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు





సంపుటి : 11 | సంచిక : 5 | జనవరి 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 5/-



చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


నరసాపురం ...... 30-10-05
జిన్నూరు............ 07-11-05
అరుణాచలం ..... 14-12-05
అరుణాచలం ..... 18-12-05
అరుణాచలం ..... 11-12-05
అన్నవరం........... 12-10-05



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-10-05, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం చేసే సేవ నాసిరకంగా ఉండకూడదు. మనం బట్టలో నాణ్యత ఎలా చూసుకొంటావెూ, చదువులో క్వాలిటీ ఎలా చూసుకొంటామో అలాగే మనం చేసే సేవలో కూడా నాణ్యత ఉండాలి. కర్త లేకుండా కర్మ చేస్తూఉంటే అది యోగం అవుతుంది, అప్పుడు పునర్జన్మను తీసుకొనివచ్చే వాసనలు క్షీణిస్తాయి. ఏదో ఒక యోగం లేకుండా, ఉపాసన లేకుండా తత్వం తెలియబడదు. స్వార్థం లేకుండా, నిరాడంబరంగా, నిరహంకారంగా ఏపని చేసినా అది ఇహానికి, పరానికి ఉపయోగపడుతుంది, ఇది భక్తులయిన మనం అందరం నేర్చుకోవాలి. ఆత్మజ్ఞానసముపార్జనకు ఏకాగ్రత ఒక్కటే సరిపోదు, క్రమశిక్షణ అవసరం. జీవితంలో అభివృద్ధిలోనికి రావాలంటే కేవలం తెలివితేటలు, పనిలో ఉన్న నేర్పు సరిపోదు, క్రమశిక్షణ అవసరం. విద్యలు చాలా ఉన్నాయి, నిజమైన విద్య ఏది? మన అంతఃకరణాన్ని బాగుచేసుకోవటానికి అంటే మనస్సును నిగ్రహించుకోవటానికి ఏవిద్య అయితే సహకరిస్తుందో అదే నిజమైనవిద్య, మిగిలినవి అన్నీ పొట్టకు సంబంధించిన విద్యలు అని రామకృష్ణుడు చెప్పారు.

ఏమతం అయినా కేవలం సిద్ధాంతాల మీద ఆధారపడి అభివృద్ధిలోనికి రాదు. శాస్త్రంలో చెప్పినప్రకారం, భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా జీవిస్తూ, సమాజం యొక్క చైతన్య స్థాయిని పెంచుతూఉండే మహర్షులు, మహాత్ములు ఆమతంలో ఎంత మంది ఉంటే అంత అభివృద్ధి అవుతూఉంటుంది. త్రికరణశుద్ధిగా మనం పనిచేస్తూ ఉంటే అది యోగం అవుతుంది, దానివలన మనం పవిత్రులం

అవుతాము, భగవదనుభవం పొందటానికి అర్హులమవుతాము. రామకృష్ణుడు తరచు ఒక మాట చెప్పేవారు సూర్యుడు ఉదయించాక నక్షత్రాలు కనబడవు, అంటే నక్షత్రాలు లేవని కాదు అవి నీకళ్ళకు కనబడటం లేదు అంతే. నీ హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. ఆయన నీకు కనబడటం లేదు అంటే ఆయన లేడు అని కాదు, నీలో ఉన్న అజ్ఞానం వలన, వ్యక్తి భావన వలన ఆయన నీకు కనబడటం లేదు. వస్తువు తనంతట తానుగా ఉంది, అది ఉండటం వలననే అది మనకు తెలియబడుతుంది. పని పనికోసమే చెయ్యి. వచ్చేది వస్తుంది, రానిది రాదు. ప్రతీదానికి ఫలితం ఆశించకు అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఆసక్తి లేకుండా పనిచేస్తే అది నీ శారీరక, మానసిక ఆరోగ్యానికి సహకరిస్తుంది. లౌకికులకు దూరంగా ఉండండి, వారి మాటలకు మీరు ఆందోళనకు గురి కావద్దు, వారు మిమ్మల్ని పొగిడినా విమర్శించినా ఏమీ పట్టించుకోవద్దు, ఎప్పటికప్పుడు మనస్సును బేలెన్స్ చేసుకొంటూ ఉండాలి. ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండాలి. జన్మల తరబడి, జన్మల తరబడి ఆరాధించగా ఆరాధించగా ఈశ్వరుడే నీకు గురురూపంలో ప్రత్యక్షమవుతాడు, ఆయన దయ వలన నీకు శాంతి కలుగుతుంది. మనకు స్వప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరుని దయ ఉండాలి. ఇవిఅన్నీ కలిసివస్తేనే భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా ఆ పని పూర్తిఅవుతుంది. ఒకోసారి పెద్దప్రయత్నం చేస్తాము, పని సున్నా. ఒకోసారి చిన్నప్రయత్నం చేస్తేనే పని పూర్తిఅవుతుంది. మనం చేస్తున్న ప్రయత్నానికి ఫలితం ఇస్తాడు, ఆయనకు ఏమీ అక్కరలేదు, అందుచేత తొందరపాటు పనికిరాదు.

రాగద్వేషములు తగ్గించుకోవటానికి మనం బాగా ప్రయత్నం చేయాలి ఎందుచేతనంటే మనం ఎక్కడికివెళ్ళినా మనలను బంధించేవి ఈ రాగద్వేషములే. లోకం నిన్ను బంధించటం లేదు. లోకం మీద నీకు ఉన్న రాగద్వేషములే నిన్ను బంధిస్తున్నాయి. రాగద్వేషాలు లేకపోతే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు. రాగద్వేషాలు లేకుండా నీవు లోకంలో విషయాలు గ్రహిస్తున్నప్పటికీ నీకు అశాంతి తీసుకొనిరావు. నీబుద్ధి మోహకలిలంలో ఉన్నప్పుడు నీకు తత్వం తెలియదు. మోహంలో నుండి బయటకు వచ్చినప్పుడే భగవంతుడు చెప్పిన మాట యొక్క విలువ మనకు తెలుస్తుంది, శాస్త్రం పట్ల మనకు గౌరవం పెరుగుతుంది, శాస్త్రంలో చెప్పిన ప్రకారం జీవించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. ప్రారబ్ధాన్ని బట్టి నీకు ధనం రావచ్చు, గౌరవం రావచ్చు, పదవులు రావచ్చు. ప్రతీదీ వస్తుంది, పోతుంది. ఎన్ని వచ్చినా సరే వాటితో తాదాత్మ్యం చెందవద్దు. నీకు నిద్రలో వచ్చేది చిన్న కల, ఇది పెద్ద కల అంతకంటే తేడా ఏమీ లేదు, అంతా స్వప్నమే. దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి కష్టంగానో,

సుఖంగానో రోజులు వెళ్ళిపోతాయి. అంతా ఈశ్వర సంకల్పంతో జరిగిపోతోంది అనే ఈ ఒక్క వాక్యం మీకు అర్థమయితే దుఃఖరహితస్థితి వస్తుంది. జరగవలసింది జరుగుతుంది, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు, ఇది నిశ్చయం. నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్. ఊరికే నిమిత్త మాత్రంగా ఉండు చేసేది అంతా ఈశ్వరుడే. ఈ శ్లోకం రోజూ గుర్తుపెట్టుకోండి. ఈశ్వరుడు ఉపాధిరహితుడు. రూపం లేనిదానిని, నామం లేని దానిని మనం ఊహించలేము కాబట్టి ఆయన ఒక రూపాన్ని, నామాన్ని పెట్టుకొని రావచ్చు అప్పుడు కూడా వాడు ఉపాధిరహితుడు. మధురైలో కృష్ణ జన్మస్థానం గదిలో ఇక్కడ కృష్ణుడు పుట్టాడు అని వ్రాయలేదు, పుట్టినవానివలె కనిపించాడు అని వ్రాసారు.

జ్ఞానం అంటే ఏమిటి అనుకొంటున్నావు నరేన్ ఓ భగవంతుడా! నీవే కర్తవు, నేను అకర్తను, ఇదేనయ్యా జ్ఞానం అంటే, ఇంతకు మించి ఏమీలేదు అన్నాడు రామకృష్ణుడు. అయితే ఇది మనకు అర్థం అవ్వాలి. మనం కర్త అనుకోవటం వలన మనకు దుఃఖం వస్తోంది. దేహబుద్ధి ఉన్నంతకాలం నేను కర్తను అని అనుకోకుండా ఉండలేడు. రామకృష్ణుడు పైన చెప్పిన వాక్యం మనం చదువుకోవచ్చు కాని అది అనుభవంలోనికి రావటం లేదు. మనలో జీవలక్షణాలు ఉన్నంతకాలం రామకృష్ణుడు చెప్పిన వాక్యం మనకు అర్థమవద్దు. దుఃఖం బయటలేదు, మనలోపల కర్తృత్వరూపంలో ఉంది. కర్తృత్వం ఉన్నంతకాలం ఈ జన్మలోనే కాదు రాబోయేజన్మలో కూడా దుఃఖం మనలను వెంటాడుతుంది. మనం ఏ పని చేసినా, ఏది మాట్లాడినా, ఏది ఆలోచించినా నేనుతో చేస్తాము, అక్కడ నుండి కర్తృత్వం ప్రారంభమవుతుంది, కర్తృత్వం దుఃఖాన్ని తీసుకొని వస్తుంది, అశాంతిని తీసుకొని వస్తుంది. కర్త నీవు కాదు, కర్త ఈశ్వరుడే. మనకు ప్రతీదానికి భయం. ప్రతీవాడు ఏదో ఒకటి ఊహించుకొని భయపడతాడు కాని వాడు ఊహించుకొన్నది ఏమీ జరుగదు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడని విశ్వాసం లేక, ఆయన మీద భారం వేయటం చేతకాక మనం భయానికి గురిఅవుతాము. ఎవడైతే నూటికి నూరుపాళ్ళు భగవంతుడి మీద భారంవేసి జీవిస్తున్నాడో వాడికి భయంతో సంబంధం లేదు. ఇవిఅన్నీ మనం బాగుపడటానికి చెప్పిన మాటలు. ఇల్లు కట్టుకోవాలంటే దానికి కావలసిన మెటీరియల్ అంతా పోగుచేసుకొంటాము అలాగే మోక్షం పొందటం కోసం తగిన సామగ్రి అంతా సమకూర్చుకోవాలి. నాకు మోక్షం కావాలంటే వచ్చేయదు. మనం లోపల కూల్‌గా ఉండాలి, లోతులు పెంచుకొంటూ రావాలి, మనలో ఏదో ప్రత్యేకత ఉన్నట్లు ఇతరులకు కనబడకూడదు. నాలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటే వాడు బంధింపబడతాడు.

భక్తి అనేది నీకు, ఈశ్వరుడికి సంబంధించిన విషయం, సమాజానికి ఏమీ సంబంధం లేదు. లోపల బలం పెంచుకొంటూ రావాలి, పైకి అందరిలాగే కనబడాలి. దేహభావన తగ్గించుకొంటూరావాలి, జ్ఞానాన్ని పెంచుకోవాలి, పైకి అందరిలాగే ఉండాలి. మనకు ఈశ్వరుడి పట్ల రక్తి ఉండాలి, విషయాల పట్ల విరక్తి ఉండాలి. సబ్జక్టు మనకు ప్రోపర్‌గా అర్థమవుతూ ఉంటే మనకు శాంతి అందుతుంది. ఈశ్వరుడికి మించిన శక్తి లేదు, సౌందర్యం లేదు. సౌందర్యం అంటే లోపలది అంతేగాని చర్మసౌందర్యం కాదు. శ్రీరంగంలో ఒక భక్తుడు ఉండేవాడు. వాడికి భార్య అంటే చాలా ఇష్టం. భార్య నడుస్తూ ఉంటే ఎండ తగలకుండా గొడుగుపట్టుకొని వెనకాల వెళుతున్నాడు. ఎందుకని నీ భార్యకు గొడుగు పడుతున్నావు అని రామానుజులు అడిగారు. నా భార్య నేత్రద్వయం చాలా అందమైనవి, అవి ఎండకు కందిపోకుండా ఉండటం కోసం గొడుగుపడుతున్నాను అన్నాడు. ఇంతకంటే అందమైన కళ్ళు చూపిస్తాను వస్తావా? అని రామానుజులు అడిగారు. వస్తాను అన్నాడు ఆ భక్తుడు. రామానుజులు ఆ భక్తుడిని గుడికి తీసుకొని వెళ్ళి నీ నేత్రాల యొక్క సౌందర్యాన్ని చూపించమని రంగనాధుడిని ప్రార్థిస్తాడు. రంగనాధుడి యొక్క సౌందర్యం చూసాక ఆ భక్తుడిలో మార్పు వచ్చింది. భార్య మీద ఉన్న రక్తి, భక్తి అంతా కూడా భగవంతుడి వైపు మళ్ళింది. రంగనాధుడికి శరణాగతి చెంది, ఆయనను ఉపాసించి తరించాడు. రామానుజుల దయవలన ఇది అంతా జరిగింది. జీవుడిని భగవంతుడితో అనుసంధానం చేసేవాడే ఆచార్యుడు. ఈ ప్రకృతి ఏమిటి? పంచభూతాలు ఏమిటి? ఈశ్వరుడు ఎంత శక్తిమంతుడు? ఇటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. ఈ దేహం మరణించకముందే మరణం లేని వస్తువును తెలుసుకొని బయటకు వెళ్ళిపో. నీకు మామిడిపండ్లు తినాలంటే తినివెళ్ళిపో అంతేగాని ఆ మామిడిచెట్టు యొక్క ఆకుల గురించి, కొమ్మల గురించి విచారిస్తూ ఉంటే నీకు మామిడి పండు దొరకదు. ఈశ్వరుడి శక్తిని నీవు ఊహించలేవు. నీవు వచ్చిన పని ఏదో చూసుకొని వెళ్ళిపో. అనిత్యమైన వాటిని ఆధారంగా చేసుకొని వాటిని ఉపయోగించు కొని నిత్యస్థితిలోనికి, సత్యస్థితిలోనికి జారిపో. మనం చనిపోతే ఈ సంసారం ఏమైపోతుంది, వీరంతా ఏమైపోతారు అనుకొంటాము, అలా అనుకోవద్దు. నీవు చనిపోతే వారు బాగుపడవచ్చు, నీవు సంపాదించినది ఏదైనా ఉంటే పంచుకొంటారు. ఇంట్లో పనిచేసే మనిషి ఎలా ఉంటుందో నీవు కూడా అలాగ జీవించు, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. పని మనిషి మన ఇంట్లో ఉన్న పని అంతా చేస్తుంది, మన వస్తువులను జాగ్రత్తగా చూస్తుంది, మనకు ఏదైనా దుఃఖం వస్తే తనుకూడా దుఃఖపడుతుంది. కాని తన హృదయాంతరాళాలలో ఇవి ఏమీ నావి కాదు

అని ఆ పనిమనిషికి తెలుసు. నీ ఇంట్లో జీవించేటప్పుడు నీవు కూడా అలాగ జీవించు, నీవు తరిస్తావు.

మీరు పూజ చేస్తున్నారు, జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు. ఆ చేసేవాడు ఎవరు? అని ప్రశ్నించండి, దానిని డౌట్ చెయ్యండి. అప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. మీకు లోచూపు కలుగుతూ ఉంటే అనుగ్రహం యొక్క స్పర్శ మీకు తెలుస్తూ ఉంటుంది. మీకు దుఃఖం వస్తూ ఉంటే దుఃఖం దేహానికి రావటం లేదు, నేనుకు వస్తోంది. ఆ నేను ఎవరు? అని ప్రశ్నించుకోవాలి. అది నీ సొంత సమస్య, ఆ సమస్యను నీవే పరిష్కరించుకోవాలి. దానికోసం నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే, నీ ప్రయత్నమే భగవంతుని దయగా మారిపోతుంది. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడు, ఈ సృష్టినంతా నడిపిస్తున్న భగవంతుడు నీ భక్తికి లోబడి నీ హృదయంలో ఇమిడిపోతున్నాడువయ్యా, వాడు కరుణామయుడు. ఓ భగవంతుడా! నీ సిద్ధులు, మహిమలు, జ్ఞానం, సృష్టిని ఆడించే శక్తి అంతా నీ దగ్గరే పెట్టుకో. కాని నిన్ను ప్రార్థించేది ఒక్కటే నీ పాదాల యందు భక్తిని ప్రసాదించు. ప్రారబ్ధాన్ని బట్టి ఈ దేహం ఎంతకాలం ఉండాలో అంతకాలం తిరుగుతూ ఉంటుంది, ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది, కాని నీవు చేయవలసింది ఏమిటి అంటే ఈ దేహం మరణించక ముందే ఈ దేహాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకొని భగవదనుభవం పొందటానికి ప్రయత్నించు. దేహాభిమానంతో పనిచేస్తే పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించ వలసిందే. దేహాభిమానం లేనివాడికి పుణ్యం లేదు, పాపం లేదు. బుద్ధిమంతుడు పుణ్యాన్ని, పాపాన్ని శరీరానికి మరణం రాకముందే అన్నీ ఇక్కడే వదిలేస్తాడు, వాడు పొందవలసింది పొందుతాడు.

ప్రారబ్ధం ప్రకారం శరీరయాత్ర జరిగిపోతూ ఉంటుంది అని చెపుతున్నారు కదా ఇంక మనం చేసే సాధన ఎందుకు? దేహం ద్వారా జరిగేది జరిగిపోతూ ఉంటుంది, ఆ జరిగే విషయాలతో, సంఘటనలతో తాదాత్మ్యం పొందకుండా ఉండటానికే సాధన. జరిగే విషయాలను ఆపటానికి కాదు, ఆ విషయాలతో కలవకుండా ఉండటానికి ప్రయత్నం అవసరం. దేహగతమైన చరిత్ర జరుగుతూ ఉంటుంది, దానితో తాదాత్మ్యం పొందకుండా ఉండే స్థితిని సంపాదించు. కొంతమంది తపస్సులు చేసినట్లు, భగవంతుడిని కోరికలు అడిగినట్లు, ఆయన ఇచ్చినట్లు ఉంది కదా! అని అడిగితే వారు ఎంత తపస్సులు చేసినా వారి ప్రారబ్ధంలో ఉన్నదే కోరుకొంటారు, కానీ లేనిది కోరుకోరు. భగవంతుడు ఇచ్చాను అంటాడు అంతే. "నా ధర్మపత్ని అయిన నీకంటే, నా ప్రతిరూపమైన శివుడికంటే, నా

సహోదరుడు బలరాముడు కంటే నా భక్తులు అంటే నాకు ఎక్కువ ఇష్టం రుక్మిణీ!" అంటాడు కృష్ణుడు. అంటే భక్తులకు స్వాధీనమవుతాడు. అనేక జన్మల నుండి మీరు ప్రార్థించగా, ప్రార్థించగా, స్మరించగా స్మరించగా, ఆరాధించగా ఆరాధించగా ఈశ్వరుడే కాళ్ళు చేతులు తొడుక్కొని మానవరూపంలో వస్తాడు, వాడు మనం ఒక్కటే అనుకొంటాము, వాడికి మనకు లోపల ఎంతదూరం ఉందో మనకు తెలియదు. దేహంలో ఉండు, దేహంలో ఉన్నా ఆ దేహం మీది అనుకోవద్దు, మీరు కానిదానిని మీరు అనుకోవద్దు, ఒకవేళ మీది అనుకొన్నా దేహం మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. ఈ ఒక్క వాక్యం చాలు మనం తరించటానికి, మనకు వైరాగ్యం రావటానికి సహాయసహకారములు అందిస్తుంది.

గురువు మనలో అంతర్యామిగా ఉంటాడు. నీలోని బలహీనతలను చూస్తూ ఉంటాడు, నిన్ను యాగీ చేయడు, లోపల ఉన్న వస్తువు గోచరం అవ్వకుండా నీలో ఏ ఆటంకాలు అయితే ఉన్నాయో వాటిని నెమ్మదిగా తొలగిస్తాడు. ఆయన ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి వెళ్ళేవరకు ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలో కూడా నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు. ఒకవేళ నీవు గురువును విడిచిపెట్టినా, ఆయన నిన్ను విడిచిపెట్టడు. ఆయన మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, శరీరం ధరించి ఉండటం అనుగ్రహం, వాడు గురువు. నీలో ఉన్న బలహీనతలను తొలగించు కోవటం నీకు భారం అవ్వవచ్చుకాని అది వాడికి భారం కాదు. నీలో ఎన్ని బలహీనతలు ఉన్నా అన్నింటినీ తొలగిస్తాడు. లోపల సిద్ధంగా ఉన్న వస్తువును నీకు సిద్ధింప చేస్తాడు, వాడు గురువు. ఎవరిని అనుకరించవద్దు, నీ పద్ధతిలో నీవు ప్రయత్నం చేసి తరించు. జీవితంలో ఏదైనా సాధించినప్పుడు నేను సాధించాను అనుకొంటే అది భగవంతుడిని అగౌరవపరచినట్లు అవుతుంది. నీవు అంటూ ఒకడివి ఉన్నావా సాధించటానికి. నీ సాధనలో మనస్సును ఇన్వాల్వు చెయ్యి, ఎందుచేతనంటే మనస్సు కరిగితేనేకాని నీకు బ్రాహ్మీస్థితి రాదు. తెర బాగా పల్చగా ఉంటే ఆ ప్రక్కన ఉన్నవాడు ఈ ప్రక్కకు కనబడతాడు. మనస్సు చిరగకపోయినా కనీసం అంత పల్చగా చేసుకొంటే లోపల ఉన్న పరమాత్మ నీకు గోచరిస్తాడు, మిగతాపని ఆయన చూసుకొంటాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-11-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దీపావళి గురించి రెండు కథలు చెపుతారు. నరకచతుర్ధశి రోజున వాసుదేవుడు నరకాసురుడిని సంహరించాడని, ఆ రాక్షస సంహారం అయిన తరువాత మరుసటి రోజున దీపావళి పండుగ చేసుకొన్నారని చెపుతారు. ఉత్తరప్రదేశ్‌లో ఇంకోరకంగా చెపుతారు.

రాముడు అరణ్యవాసం పూర్తిచేసుకొని దీపావళి రోజున అయోధ్యకు వచ్చాడు కాబట్టి ఆ రోజున అక్కడ దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చి పండుగ చేసుకొన్నారని చెపుతారు. దీపం జ్ఞానానికి గుర్తు. దీపం చీకటిని పోగొడుతుంది, జ్ఞానం అజ్ఞానాన్ని పోగొడుతుంది. అందుచేత పూజ చేసుకొనేటప్పడు ముందుగా దీపం వెలిగిస్తారు. మనం ఏమిచేయాలి అంటే శ్రీరామచంద్రమూర్తిని మన హృదయంలోనికి ఆహ్వానించి అక్కడ నిలుపుకోవాలి, ఆయనను ఆరాధించుకోవాలి, జపించుకోవాలి. మనం ఏదైనా మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది, చెడ్డపనులు చేస్తే పాపం వస్తుంది. ఇవన్నీ లోకానికి సంబంధించిన విషయాలు. మనం ఏదైనా కష్టం వచ్చినా, ఎప్పడైనా సంతోషం వచ్చినా అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. పుట్టుక నిజంకాదు, చావు నిజంకాదు. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. ఏవో బాహ్యమైన ప్రక్రియల వలన ఈ సంసారచక్రంలో నుండి, ఈ మహాస్వప్నంలో నుండి విడుదలపొందలేము. ఈ మహాస్వప్నంలో నుండి విడుదలపొందాలంటే మన హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవాలి, ఇంకో దారి లేదు. మనం భక్తిమార్గంలో గాని, కర్మమార్గంలో గాని, జ్ఞాన మార్గంలో గాని మొత్తం మీద ఏదోమార్గంలో ప్రయాణంచేసి నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా మనం హృదయంలో ఐక్యమవ్వాలి.

మీకు రాబోయేజన్మలు ఎటువంటి జన్మలు వస్తాయో మీరు జాగ్రత్తగా చూసుకొంటే మీకే తెలుస్తుంది. మీరు ఏకాంతంగా కూర్చొని మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో, మీకు ఉన్న కోరికలు ఏమిటో అన్నీ చూసుకొంటే దానిని బట్టే రాబోయేజన్మ ఇస్తాడు. భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరిమీద అయిష్టం ఏమీ ఉండదు. పూర్వజన్మలో మనం చేసిన పాపాలే ఈ జన్మలో మనకు రోగాలకింద వస్తాయి అని కొంతమంది అంటూ ఉంటారు. అయితే ఈ పాపాలు, ఈ పుణ్యాలు, ఈ రోగాలు అన్నీ స్వప్నమే కాని ఇది అంతా స్వప్నం అని ఇప్పడు మనకు తెలియదు, మన హృదయంలో ఉన్న బంగారం మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు తెలుస్తుంది. బంగారం అంటే ఒకటి గుర్తుకు వస్తోంది. మనం రాముడిని, కృష్ణుడిని ఎలా ఆరాధిస్తామో అలాగ థాయ్‌లాండ్‌లో బుద్ధుడిని ఆరాధిస్తారు. మనం రాముడి విగ్రహం, కృష్ణుడి విగ్రహం ఎలా చేయించుకొంటామో అలాగ 100 సంవత్సరాల క్రితం అక్కడ ఒకరు బుద్ధుడి విగ్రహం చేయించి ఒక రోడ్డు సెంటరులో పెట్టి, ఎండవాన తగలకుండా దానికి కప్ప నిర్మించారు. రోడ్డు వెడల్పు చేయవలసి వచ్చి ఆవిగ్రహాన్ని తీసి ఇంకోచోట పెట్టాలను కొన్నారు. ఆ విగ్రహాన్ని తీసుకొని వెళుతూఉండగా విపరీతమైన వర్షం వచ్చింది, అది మట్టి విగ్రహం. ఎంత గొడుగులు పట్టినా మట్టి అంతా కరిగిపోయింది,

లోపల బంగారం ఉంది. అసలు అది బంగారువిగ్రహం. చేయించినవాడికి అదితెలుసు కాని ప్రజలు అందరూ మట్టివిగ్రహం అనుకొనేవారు. చేయించినవాడు ఏమనుకొన్నాడు అంటే బంగారం విగ్రహం అయితే ఎవడైనా పట్టుకొనిపోతాడు అని బుద్ధుడిమీద ప్రేమకొలది బంగారంతో విగ్రహం చేయించి ఎవరూ తీసుకొని వెళ్ళకుండా పైన దట్టంగా మట్టి పూసేసారు. ప్రజలు అది మట్టి విగ్రహం అనుకొని దానిజోలికి ఎవరూ వెళ్ళలేదు. ఇప్పటికీ థాయ్‌లాండ్‌లో ఆవిగ్రహం ఉంది. మట్టిపోయింది, బంగారం మిగిలింది. థాయ్‌లాండ్ ప్రజలు ఏమంటారు అంటే అది మట్టి విగ్రహం అని మేము అనుకొన్నాము. వర్షం వచ్చి మట్టి కరిగిపోయేవరకు అది బంగారపు విగ్రహం అని ఎవరికీ తెలియదు అంటారు. అలాగే మన హృదయంలో బంగారం ఉంది. అక్కడ మట్టి బంగారపు విగ్రహాన్ని మూసేసింది. మన మనస్సులో ఉన్న రాగద్వేషములనే మట్టి, మన హృదయంలో ఉన్న బంగారం మనకు కనబడకుండా చేస్తున్నాయి. బంగారపు విగ్రహం మీద ఉన్న మట్టి పోయినతరువాత బంగారపు విగ్రహం ఎలా వెలుగులోనికి వచ్చిందో అలాగే మన హృదయంలో ఉన్న బంగారం బహిర్గతం అవ్వాలంటే మన మనస్సులో ఉన్న మట్టి అంతా కరిగిపోవాలి. ప్రతీమనిషి అజ్ఞానంలో కూరుకొని పోవటానికి రాగద్వేషాలే కారణం అని బౌద్ధమతస్థులు చెపుతారు. మనం ఎన్నిరకాల సాధనలు చేసినా, పూజలు చేసినా, జపాలు చేసినా రాగద్వేషముల నుండి బయటకు రాకపోతే మనస్సుకు శాంతిరాదు, మనస్సుకు స్వచ్ఛతరాదు, మనస్సుకు సూక్ష్మతరాదు, ఇవి రానప్పుడు హృదయంలో ఉన్న బంగారం కూడా మనకు తెలియదు. ఏదైనా ఒక విషయం అర్థం కావాలంటే మనస్సుకి స్పష్టత ఉండాలి. మీరు ఏ ఊరు వెళుతున్నారు అని అడిగితే ఏ ఊరు వెళుతున్నామో మాకే తెలియదు అంటే అర్థం ఏమిటి? అసలు మన గమ్యం ఏమిటి? మనం పొందవలసింది ఏమిటి? మనకు ఒక అవగాహన ఉండాలి కదా.

మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, సత్కర్మ చేయండి దానివలన పుణ్యం వస్తే రానివ్వండి. కాని పుణ్యం మీ లక్ష్యం కాకూడదు, మీ హృదయంలో ఉన్న సద్వస్తువును అనుభవైకవేద్యం చేసుకోవాలి, అది జీవితగమ్యంగా పెట్టుకో. జనక మహారాజు లోకక్షేమం కోసం నిరంతరం పనిచేసాడు, ఎప్పుడూ ఏదో ఒక సత్కర్మ చేస్తూనే ఉండేవాడు. కర్మచేసి ఆయన వ్యక్తిగతంగా పొందింది ఏమైనా ఉందా అంటే ఏమీలేదు, అలాగని ఆయన పనిచేయటం మానలేదు. జనకమహారాజును ఆదర్శంగా పెట్టుకొని పని చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. నువ్వు చేసేది లోకక్షేమం కోసం సత్కర్మ చెయ్యి దానివలన లోకం ఉద్ధరింపబడుతుంది అనికాదు, నువ్వు ఉద్ధరింపబడతావు. మనం ఎవరికయినా

సహాయం చేసాము అనుకోండి వారిని ఉద్ధరిస్తున్నాము అని మనం అనుకోకూడదు, సహాయం చేయటానికి వారు మనకు అవకాశం ఇస్తున్నారు అనుకోవాలి. రాముడి రాజ్యంలో ఎవరికయినా పాలు పంపుదాము, మజ్జిగ పంపుదాము అనుకొంటే అయోధ్యలో తీసుకొనే వారు కనబడేవారు కాదు, ఎవరూ పుచ్చుకోకపోతే ఎవరికి ఇస్తాము. ఇప్పడు పుచ్చుకొనే వారు కనబడుతున్నారు, ఇచ్చేవారు కనబడటం లేదు.

మనం మంచిస్నేహాలు విడిచిపెట్ట కూడదు. మంచిస్నేహాలు విడిచిపెట్టేసాము అనుకోండి మనకు దుఃఖం మిగులుతుంది, అశాంతి మిగులుతుంది. ఇక్కడ అశాంతి పడ్డా పరవాలేదు చనిపోయిన తరువాత చీకటి లోకాలు మిగులుతాయి. ఆచార్యుడు అంటే ఎవడు? అని ఒకసారి శంకరాచార్యులవారు అడిగారు, అక్కడ ఉన్న ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే రాముడా, శివుడా అని కాదు ఎవడైతే నా అజ్ఞానాన్ని పోగొడుతున్నాడో, ఎవడైతే నా వాసనలను క్షయం చేస్తున్నాడో వాడే ఆచార్యుడు అని చెప్పాడు, అద్భుతమైన సమాధానం, ఆ సమాధానానికి ఆచార్యులవారు కూడా ఆశ్చర్యపోయారు. మనం వాస్తవ పరిస్థితులకు దూరం అవ్వకూడదు, గాలిలో మేడలు కట్టవద్దు. మీ కుటుంబ పరిస్థితులు ఇతరులకు తెలియకపోయినా, మీకు తెలుసు కదా. ఆ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జీవిస్తూ, ఆధ్యాత్మిక అభివృద్ధిని గమ్యంగా పెట్టుకోవాలి. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, దానికి బయట ఎవరో కారణం అని మీరు అనుకోవద్దు, మీ దుఃఖానికి మీరే కారణం అది బాగా అర్థం చేసుకోండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోలేరు అనుకోండి మీకు వందకోట్లు ఉన్నా మీకు దుఃఖం వచ్చేస్తుంది, మిమ్మల్ని మీరు అర్థం చేసుకొంటున్నారు అనుకోండి, ఆత్మజ్ఞానసముపార్జనలో ఉన్నారు అనుకోండి మీకు ఏమీ లేకపోయినా మహాచక్రవర్తిలాగ ఉంటారు. ఏమీ లేనివారు కూడా గొప్ప ఆనందంగా ఉండటం నేను చూసాను, మనకు అన్నీ ఉండి ఇంక రోజూ ఏడవటమే పని అంటే మనకు జ్ఞానం లేదు అని అర్థం. మనల్ని మనం అర్థం చేసుకొంటూ ఉంటే, మన మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే, రాగద్వేషములు తగ్గించుకొంటూ ఉంటే, మన బుద్ధికి సూక్ష్మత కలుగుతూ ఉంటే మనకు సుఖం తెలుస్తుంది, శాంతి తెలుస్తుంది, మనం ఎవరిగా ఉన్నామో దాని తాలుక ఎరుక మనకు కలుగుతుంది.

మనం అందరం ఈ దేహం నేను, దేహం నేను అనుకొంటాము కదా, మొత్తం రోగం అంతా ఈ దేహం నేను అనే తలంపులోనే ఉంది. పూసలదండలో ఆ పూసలన్నింటికి లోపల దారం ఆధారంగా ఉంది. అలాగే మనకు వచ్చే ఆలోచనలకు, తలంపులకు అన్నింటికీ దేహం నేను అనే తలంపు ఆధారంగా ఉంది. దేహము నేను అనే మొదటి తలంపు ఎంతకాలం

అయితే ఉందో అంతకాలం ఇతర తలంపులు వస్తూనే ఉంటాయి. ఉన్నది ఒక్కటే వస్తువు, ద్వితీయం లేనేలేదు. ఆ వస్తువునే జీవుడని, శరీరం అని, మరొకటి మరొకటి అని మనం అనుకొంటున్నాము. ఆ వస్తువును ఉన్నది ఉన్నట్లుగా అభివ్యక్తం చేసుకోలేకపోతే నీకు పునర్జన్మలు తప్పవు. ఓ అరుణాచలేశ్వరుడా! నీవు ఒక్కటే పనిగా పెట్టుకొన్నావు, రెండో పని నీకు లేదు. చెట్టు చుట్టూ తీగ ఎలా పాకుతుందో అలాగ ఎవడైతే నీ రూపం చుట్టూ, నామం చుట్టూ పాకుతున్నాడో, ఎవడైతే నిన్ను ఆశ్రయించాడో వాడి జీవలక్షణాలను పోగొట్టటమే పనిగా పెట్టుకొన్నావు. ఎప్పుడైతే జీవలక్షణాలు అన్నీ కాలి బూడిద అయ్యాయో హృదయంలో ఉన్న సత్యవస్తువు ఎరుకలోనికి వస్తుంది. ఎక్కడయితే మనస్సు, ఇంద్రియాలు అణిగిపోయినాయో, ముక్కులో గాలి తిరుగుతున్నప్పటికీ ఎవడైతే చచ్చినవాడిలాగ బతుకుతున్నాడో వాడికి బ్రహ్మం ఎరుకలోనికి వస్తుంది. బ్రాహ్మీస్థితి పొందినవాడిని ఈ సృష్టి ఏమీ చేయలేదు, వాడు ఈ సృష్టిలో నుండి విడిపోతాడు. అంటే లోకం ఉండగానే వాడు లోకానికి అతీతం అవుతాడు, దేహం ఉండగానే ఈ దేహానికి అతీతం అవుతాడు. దేహం చనిపోతున్నప్పుడు కూడా నేను చనిపోతున్నాను అనే తలంపు వాడికి ఉండదు, పైగా ఈ దేహానికి చేసే చాకిరి పోతుంది అనుకొంటాడు. మనకు ముసలితనం వస్తోంది అంటే చావు దగ్గరికి వస్తోంది అని అర్థం. అందుచేత మనం ముసలివారము అయిపోయాము, పని, పాటూ లేకుండా కూర్చొందాము అనుకోవద్దు. ఇంక నాలుగు సంవత్సరాలో, అయిదు సంవత్సరాలో టైము ఉంటే ఆ కాలాన్ని మీరు పూర్తిగా సద్వినియోగం చేసుకొని బ్రాహ్మీస్థితిని పొందాలి. మనందరకు డబ్బు విలువ తెలుసుగాని కాలం విలువ తెలియదు. అందరూ కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. చనిపోయే రోజు వచ్చేసింది అనుకోండి ఇంక సాధన ఎక్కడ చేస్తాము. డబ్బుకంటే ముఖ్యమైనది కాలం. డబ్బుపోతే మనం తిరిగి సంపాదించుకోవచ్చు కాని జరిగిపోయిన కాలం మరల తిరిగిరాదు.

24 గంటలు మనం లోకం గొడవలలో ఉంటున్నాము, ఈ లోకం గొడవలు మనం నరకానికి వెళ్ళటానికి మెట్లు కడతాయి. కొన్ని సత్సంగాలు ఎలా ఉంటాయి అంటే ఒక అరగంట ఏదో ఒకటి చదివేస్తారు తరువాత ఊరిలో గొడవలు అన్నీ చెప్పకొంటారు. మనకు నరకానికి వెళ్ళే యోగం ఉంది కాబట్టి లోకాన్ని విడిచిపెట్టలేకపోతున్నాము. నీ పని ఏదో నీవు చూసుకో, అస్తమాను లోకం గొడవలలోనికి వెళితే నీకు పతనం తప్పదు అని భగవాన్ చెప్పారు. లోకం గొడవలు చెప్పకోవటం వలన భౌతికంగా మనకు ఏదైనా లాభం ఉందా అంటే ఏమీ లాభం లేదు, చనిపోయిన తరువాత చీకటి లోకాలు అంటే అక్కడనున్నా, ఇక్కడా

సున్నా. కొంతమందికి అస్తమానూ దేహం గొడవ, లేకపోతే లోకం గొడవ ఇటువంటి మనకా ఆత్మజ్ఞానం కలిగేది? మొత్తం ఈ సృష్టి కంతకు ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, ఏ వస్తువులో ఈ సృష్టి అంతా లయమవుతోందో అది మనమై ఉన్నాము. అట్టి ఆనంద వస్తువే మనం అయినప్పడు ఇంక మనకు ఎందుకు దుఃఖం వస్తోంది? ఆనంద వస్తువు మనకు ఎరుకలో లేకపోవటం వలన మనకు దుఃఖం వస్తోంది. అహంబ్రహ్మాస్మి అనేది అనుభవానికి సంబంధించిన మహావాక్యము. లోపల అనుభవం లేదు అనుకోండి వూరికే అహంబ్రహ్మాస్మి అహం బ్రహ్మాస్మి అని అనుకోవటం వలన ప్రయోజనం లేదు. నీ లోపల బ్రహ్మం ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి నీవు వెళితేకదా అది నీకు దొరికేది. వాక్కును నియమించి, ఇంద్రియాలను నియమించి, మనస్సును నియమించి నీవు లోపలకు వెళితే లోపల బ్రహ్మం నీకు ఎరుకలోనికి వస్తుంది. నీవు కష్టపడి విద్యను సంపాదించటం కంటే, కష్టపడి ధనం సంపాదించటం కంటే భక్తిని సంపాదించటం చాలా కష్టం. అందులో ఉన్న కష్టం వారికి తెలియక భక్తి లేనివారు ఏమనుకొంటారు అంటే ఏదో భక్తులు కదా అనుకొంటారు. వారికి తెలియకపోవటం వలన అలా అనుకొంటున్నారు, దానిలో వారి పొరపాటు ఏమీ లేదు. మీరు భక్తిని సంపాదించారా మీకు ముక్తి వచ్చేసినట్లే. మీ చేతిలో డబ్బు ఉండాలి కాని బజారుకు వెళ్ళి చీర ఎంతసేపు కొనుక్కొంటారు అలాగే మీకు భక్తి ఉండాలి కాని ముక్తి ఎంతసేపు వస్తుంది. భక్తి అనేది పైనుంచి పోసేదికాదు, లోపల నుండి ఊరాలి. అసలు మనం చేసే సహవాసాలే మంచివి కానప్పడు ఇంక మనకు భక్తి ఎలా వస్తుంది, సుఖం ఎలా తెలుస్తుంది. సహవాసం మంచిది కాకపోతే ఆత్మజ్ఞానం పొందాలి అనే సంకల్పం కూడా మనకు రాదు.

మీరు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం మనం కాపాడుకోకపోతే సాధన చేయలేము. సాధన లేకపోతే సిద్ధి కలుగదు. మోక్షాన్ని పొందటమే గమ్యంగా పెట్టుకొన్నప్పడు మోక్షం పొందటానికి తగిన సామాగ్రిని ఎలా సంపాదించుకోవాలో జాగ్రత్తగా చూసుకోవాలి. మోక్షం పొందటానికి మనలో ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో, ఆ ఆటంకాలను ఎలా తొలగించుకోవాలో మనం ప్లాన్ చేసుకోవాలి. నువ్వు ఏ వస్తువును పొందటానికి జన్మల తరబడి ప్రయత్నం చేస్తున్నావో అది నీ హృదయంలోనే ఉంది. కాని అది నీకు ఎందుకు తెలియటం లేదు అంటే నీ ప్రయత్నంలో చిత్తశుద్ధి లేదు. నువ్వు చేసే ప్రయత్నంలో ఎక్కడో దోషం ఉంది. కొంతమంది మనస్సును ఎప్పడూ భౌతిక విషయాల మీద పెట్టుకొంటారు, నోరు ఏమో రామ రామ అంటూ ఉంటుంది. అది నీ

లోపల ఉన్న రాముడు చూస్తూ ఉంటాడు. మనస్సును విషయాలకు ఇచ్చేసాడు, నోటితో రామ రామ అంటున్నాడు, వీడు నన్ను మోసం చేయటానికి చూస్తున్నాడు అని ఆయన అనుకొంటాడు. నీవు ఏదైనా ఒక పని చేయాలనుకొన్నప్పుడు నీకు ఉన్న తెలివిని, శక్తిని ఉపయోగించి ఆ పనిని సాధించటానికి నువ్వు ఎంత ప్రయత్నం చేస్తావో అలాగే బ్రాహ్మీస్థితిని పొందటానికి నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీకు ఉన్న తెలివిని ఉపయోగించాలి, నీకు ఉన్న పుణ్యాన్ని పెట్టుబడిగా పెట్టి ఇన్ని రకాలుగా ప్రయత్నం చేస్తేగాని లోపలఉన్న వస్తువు నీకు తెలియదు. మనస్సులో ఒకటి పెట్టుకొని, నోటితో ఇంకోటి చెపుతూ, చేతితో మరొకటి చేస్తూ ఉంటే నీకు లోపలఉన్న వస్తువు ఎలా తెలుస్తుంది.

ఈశ్వరుని దయకు పాత్రుడవు అవ్వటానికి నీవు త్రికరణశుద్ధిగా పనిచేయాలి. త్రికరణ శుద్ధిగా పనిచేయకపోతే నీకు అంతఃకరణ శుద్ధిరాదు, అంతఃకరణ శుద్ధి లేనివాడికి కోటి జన్మలు ఎత్తినా ఆత్మజ్ఞానం రాదు. నీ బుద్ధి పవిత్రం కాకపోతే పరమపవిత్రుడైన ఈశ్వరుడు నీకు ఎలా ఎరుకలోనికి వస్తాడు, వాడిని నీవు మోసం చెయ్యగలవా? మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. కాని ఇష్టా, అయిష్టాలనే గాలి మనం ఎంత ప్రయత్నం చేసినా లోపలకు వెళ్లనివద్దు, ముందు వాటిని తగ్గించుకోవాలి. ఎప్పుడు ఏది అవసరమో భగవంతుడు చూస్తాడు, ఆయనను తొందరపెట్టవలసిన పని లేదు. తీగ చెట్టును ఏ విధంగా పట్టుకొని ఉంటుందో అలాగ నీవు ఈశ్వరుని పట్టుకొని ఉంటే నీకు ఏది మంచిదో ఆయనే చూసుకొంటాడు. నువ్వు పరమేశ్వరుని చుట్టుకొనిపోతూ ఉంటే నీకు అన్యచింతలు ఎందుకు వస్తాయి, రానే రావు. నువ్వు ఎంత సాధన చేస్తున్నప్పటికీ ఇంద్రియాలతో, మనస్సుతో, వాక్కుతో ఈశ్వరుడిని చుట్టుకోకపోతే నా మాయ మటుకు నీకు దారి ఇవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. నువ్వు ఎంతో సాధన చేస్తున్నప్పటికీ భగవంతుడి పాదాలను ఆశ్రయించాలి. అప్పుడు మాయ దారి ఇస్తుంది. మాయ దారి ఇవ్వకపోతే నువ్వు ఎంత సాధన చేసినా నీకు మోక్షం లేదు. ఈ లోకం మంచిది కాదు, చెడ్డదీ కాదు. ఒక చెట్టు ఉంది అనుకోండి. ఆ చెట్టు కింద నీడకోసం ఒకడు కూర్చోవచ్చు, ఆ చెట్టుకే ఒకడు ఉరివేసుకోవచ్చు. నీడలో సుఖంగా కూర్చోమని ఒకడికి ఆ చెట్టు చెప్పటం లేదు, ఉరిపోసుకోమని ఒకడికి ఆ చెట్టు చెప్పటం లేదు. వారి బుద్ధిని బట్టి వారు అలా చేస్తున్నారు. అలాగే ఈ లోకం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. నీ బుద్ధితో ఈ లోకాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని నీవు బాగుపడు. ఈ లోకంలోనికి నీవు ఎందుకు వచ్చావో అర్థం చేసుకో. నువ్వు వచ్చిన పని పూర్తి చేసుకొని వెళ్లిపో. ఆ వెళ్లిపోవటంలో కూడా నువ్వు ఈ లోకంలోనికి వచ్చి వెళ్లావనే గుర్తు కూడా

లేకుండా వెళ్ళిపోవాలి. అప్పుడు నీకు ఈశ్వరుని దయ కలుగుతుంది. అంటే నీ పని ఏదో నీవు శ్రద్ధగా చేసుకో, గుర్తింపులు కోరుకోవద్దు.

బంధం లేదు, మోక్షం లేదు అంటున్నారు, నిజంగా బంధం లేదు అనుకోండి నాకు దుఃఖం ఎందుకు వస్తోంది? అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు బంధంలో ఉన్నాను అనుకొంటున్నావు కాబట్టే నీవు మోక్షాన్ని కోరుకొంటున్నావు. నువ్వు బంధంలో లేవు అన్న సంగతి నీకు తెలిస్తే మోక్షాన్ని కోరుకోవు. నువ్వు అసలు బంధంలో లేవు, మోక్షంలోనే ఉన్నావు. ఆ సంగతి నీకు తెలిస్తే, అది నీకు అనుభవంలోనికి వస్తే మోక్షాన్ని కోరుకోవు. నీకు ఉన్న దుఃఖం నిజంకాదు, సుఖం నిజం కాదు, చావుపుట్టుకలు నిజంకాదు, పుణ్యం నిజం కాదు, పాపం నిజంకాదు, నీ మంచి ప్రారబ్ధం నిజంకాదు, చెడు ప్రారబ్ధం నిజంకాదు, ఇదంతా స్వప్నమే. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలియటం లేదు కాబట్టి నిజం కానిది నిజం వలె నీకు కనిపిస్తోంది. నీ స్వరూపం నుండి నీవు జారిపోయావు కాబట్టి దాని తాలుక ఎరుక నీకు లేదు కాబట్టి ఈ సంతోషం, దుఃఖం, చావు పుట్టుకలు, ఈ అల్లకల్లోలం అంతా నిజంలాగ కనిపిస్తున్నాయి, అందుచేత అందులో నుండి నీకు ప్రతిస్పందన వస్తోంది. నీ శరీరానికి సంబంధించిన చావు కూడా నిజంకాకపోయిన నిజం వలె నీకు కనిపిస్తోంది కాబట్టి దుఃఖానికి గురి అవుతున్నావు. ఈ లోకంలో ఉన్న ప్రేమలు నిజం కాదు, అది మోహం. అది మోహం అని తెలియక మోహాన్నే మనం ప్రేమ అనుకొంటున్నాము. మీ దేహం కంటే నా దేహం అంటే నాకు ఎక్కువ ఇష్టం. ఇక్కడ ఇన్ని దేహాలు ఉండగా నా దేహం అంటేనే నేను ఎందుకు ఇష్టపడుతున్నాను. మీ దేహంలో ఏది ఉందో నా దేహంలోనూ అదే ఉంది మరి నా దేహం అంటేనే నేను ఇష్టపడుతున్నాను ఏమిటి? అలా ఇష్టపడటానికి అహంకారం, మమకారం కారణం, ఇది బాగా అర్థం చేసుకోండి.

ఒకవేళ అరుణాచలేశ్వరుడు నీకు సుఖం తీసుకొని వచ్చినా, దుఃఖం తీసుకొని వచ్చినా, ఎప్పుడయినా నిన్ను ముద్దాడినా, నిన్ను మొట్టికాయలు మొట్టినా, నీకు శాంతి తీసుకొని వచ్చినా, అశాంతి తీసుకొని వచ్చినా ఎన్ని రకాలుగా నీతోటి ఆడుకొన్నా ఆయన లక్ష్యం ఒక్కటే, నీలోని జీవలక్షణాలను తొలగించటమే ఆయన పని, ఇంకొక పని ఏమీ లేదు. భీష్ముడు ప్రాణం పోయేముందు కర్ణుడు కూడా అక్కడకు వస్తాడు. అప్పుడు భీష్ముడు అంటాడు, కర్ణా నిన్ను చాలా కఠినమైన మాటలు అన్నాను, నీకు కష్టం కలిగించే మాటలు మాట్లాడాను. భీష్ముడు అంతటివాడు ఇలా మాట్లాడుతున్నాడు ఏమిటి? అని లోకం అనుకోవచ్చు. లోకం ఏదో ఒకటి అనుకొంటుంది, లోకం గొడవ కాదు. నిన్ను అంత కఠినంగా ఎందుకు అన్నాను

అంటే నీవు ధుర్యోధనుడి స్నేహం విడిచిపెడతావనే ఉద్దేశ్యంతో అంత కఠినంగా మాట్లాడాను. నువ్వు అంటే ఇష్టంలేక కాదు, నీమీద ప్రేమతో, నీవు బాగుపడాలనే అలా మాట్లాడాను అంటాడు. అక్కడ భీష్ముడి హృదయం చూడండి కర్ణుడి లాంటి వాడిని కూడా రక్షించటానికి చూసాడు. ఆయన మాట కాదు, ఆయన హృదయాన్ని మనం గ్రహించాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-12-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం వచ్చినపని మర్చిపోకూడదు అని భగవాన్ అనేవారు. మనం ఏ పని నిమిత్తం అరుణాచలం వచ్చామో ఆ పని మర్చిపోకూడదు. మనం భక్తిని అభివృద్ధి చేసుకోవటానికి అరుణాచలం వచ్చాము, అది మర్చిపోవద్దు. మౌనం వలన కలహాలు తగ్గిపోతాయి, మీరు తక్కువగా మాట్లాడండి. మనం జీవితంలో క్రమశిక్షణ నేర్చుకోవాలి. క్రమశిక్షణ లేకపోతే ఎంత ధనం ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా మనం సుఖపడలేము. క్రమశిక్షణ లేకపోతే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి రాలేము. మనం కాలాన్ని పాడుచేసు కొంటున్నాము, మానవజన్మను వృధా చేసుకొంటున్నాము. మానవజన్మ రావటం కష్టం. మానవజన్మకు వివేకం, విచక్షణ ఉంటుంది కాని చెట్టుకు, జంతువుకు ఉండదు. జపం లేకుండా, ధ్యానం లేకుండా, ఏవిధమైన సాధనలు చేయకుండా మానవజన్మను వృధా చేసుకోవటం ఎటువంటిది అంటే మన ఇంటికి బంధువులు వస్తే రూపాయికాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాసినట్లుగా ఉంటుంది. మరల మానవజన్మ వస్తుందో రాదో చెప్పలేము, మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, వచ్చిన అవకాశములను పోగొట్టుకోకూడదు. తెలివైన వారికి అవకాశములు వస్తాయి, వారు వాటిని పట్టుకొంటారు, అభివృద్ధిలోనికి వస్తారు. తెలివి తక్కువ వారికి అవకాశములు వస్తాయి, వారు వాటిని వదిలేస్తారు, పాడైపోతారు. తెలివైన వాడికి పురోగతి, తెలివితక్కువ వాడికి తిరోగతి.

వివాహసమయంలో పెండ్లికుమారునికి పెండ్లికుమార్తె దండవేయటం, పెండ్లి కుమార్తెకు పెండ్లికుమారుడు దండవేయటం జరుగుతుంది. అక్షరమణమాల ఇది పెండ్లి నాటిమాల. ఇక్కడ రమణమహర్షి అనే పెండ్లికుమార్తె అరుణాచలేశ్వరుడు అనే పెండ్లి కుమారుడికి దండవేసింది. నేను అక్షరాలతో తయారుచేసిన దండను నీకు వేస్తున్నాను, నీ అనుగ్రహం అనే దండను నా మెడలో వేయి అని అర్థిస్తున్నాడు. ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోండి. మీరు ప్రధానమంత్రి చేసినా, రాష్ట్రపతి చేసినా, మీ పేరు ప్రపంచం అంతా వ్యాపించినా, మీకు వేయి కోట్లు డబ్బు ఉన్నా, పాండిత్యం ఉన్నా మీకు దుఃఖం నశించదు.

గడ్డిమేట్లు పెంచుకొంటున్నట్లు బాహ్యంగా మీరు సంపదలు పెంచుకొంటే మిమ్మల్ని భాగ్యమంతులు అంటారు. అంతేకాని మీకు దుఃఖం నశించదు. అజ్ఞానం ఉన్నంతకాలం మనిషి కూడా నీడవచ్చినట్లు ఈజన్మలోనే కాదు రాబోయేజన్మలో కూడా దుఃఖం నిన్ను వెంటాడుతుంది. దుఃఖంలేనిస్థితికి మీరు వెళ్ళాలంటే అజ్ఞానం నశించాలి. అజ్ఞానం నశించకపోతే జ్ఞానం రాదు, జ్ఞానం లేకపోతే మోక్షం లేదు. ప్రతీ మనిషికి సుఖం కావాలి, ఆనందం కావాలి. దేవుడు ఉన్నాడని చెప్పినా, లేడు అని చెప్పినా నాకు సుఖం అక్కరలేదు, ఆనందం అక్కరలేదు అని ఈ ప్రపంచంలో ఇంతవరకు ఒక్కడు చెప్పలేదు. సుఖం, ఆనందం ఒక్క ఆత్మలో తప్పించి బయట ఎక్కడాలేదు. అక్కడ తప్పించి ఎక్కడో వెతికి, వెతికి ఏదో పట్టుకొంటే అది పట్టుకొన్నాక తెలుస్తుంది అక్కడ దుఃఖమే కాని సుఖం లేదని, అందుచేత పెద్దలు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవించాలి అంతేగాని మన మనస్సు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయకూడదు.

రమణమహర్షిగారికి గురువు, దైవం అంతా కూడా అరుణాచలేశ్వరుడే. రమణ మహర్షిగారు అరుణాచలాన్ని వెతుక్కోలేదు, అరుణాచలం ఆయనకు స్ఫురించింది ఇది మీరు అర్థంచేసుకోవాలి. మనం భక్తిభావన పెంచుకోకపోతే భగవంతుడిలో ఐక్యం అవ్వలేము. భక్తి అనేది కాలక్షేపం కోసం కాదు, భక్తి యొక్క గమ్యం భగవంతుడిలో ఐక్యమవ్వాలి. మీరు అరటిఆకులో భోజనం చేసేవరకు ఆకును ఎలా జాగ్రత్తగా చూసుకొంటారో, భగవంతునిలో ఐక్యం అయ్యేవరకు భక్తిని అలా కాపాడుకోవాలి. వేరు భావన పోయిన తరువాత భక్తుడు, భగవంతుడు ఆత్మ అంతా ఒక్కటే ముద్ద అయిపోతారు, అంతవరకు భక్తిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. అరుణాచలాన్ని స్మరించుకోవటం వలన లాభంలేదని అనుకోవద్దు. నిన్ను స్మరించగా స్మరించగా నాలో ఉన్న అజ్ఞానాన్ని తీసేస్తావు, నీకు నాకు ఏదైతే అడ్డుగాఉందో ఆ బేధబుద్ధి నశిస్తుంది, నీలో ఐక్యమవుతాను, నీలో ఐక్యం అయినతరువాత కదా ఆనంద కెరటాలలో ఊగిసలాడేది అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. దీక్షలు నాలుగు మౌనదీక్ష, చక్షుదీక్ష, భావదీక్ష, హస్తదీక్ష. మౌనం ద్వారా అనుగ్రహించటం, చూపు ద్వారా అనుగ్రహించటం, మనం ఆయనను స్మరించుకోవటం కాదు ఆయన మనలను స్మరించుకొంటే పని పూర్తి అయిపోతుంది అది భావదీక్ష, టచ్ చేయుటం హస్తదీక్ష. భగవాన్ ఏమంటున్నారు అంటే నాలో ఉన్న అజ్ఞానం పోవటానికి ఒక్క దీక్షతో నేను తయారవుతాను అనుకొంటే ఒక్క దీక్షను ప్రయోగించు, ఒక్క దీక్షతో నేను నీలో ఐక్యం అవ్వటానికి తయారవ్వను అనుకో మొత్తం అన్ని దీక్షలు ఉపయోగించి నన్ను ఉద్ధరించి, నీలో ఐక్యం

చేసుకో అరుణాచలేశ్వరుడా అంటున్నారు. మనం ఎక్కువగా ఏ గొడవలు అయితే ఆలోచిస్తామో చనిపోయే టైములో అవే గుర్తుకు వస్తాయి, దానిని బట్టి పునర్జన్మ వస్తుంది. ఇప్పటినుండి భగవంతుని స్మరిస్తూ ఉంటే, ఆయన మాటలే చెప్పకొంటూ ఉంటే, పవిత్రమైన ఆలోచనలు వస్తూ ఉంటే చనిపోయే టైములో మనకు మంచిఆలోచనలు వస్తాయి. మనకు మోక్షం రాకపోయినా మంచిజన్మలు వస్తాయి.

నా అహంకారం సూది చేసే పని చేస్తుంది కాని దారం చేసే పని చేయదు. ఎక్కడికక్కడ పొడుచుకొంటూ వెళుతుంది, బేధబుద్ధిని పెంచేస్తుంది. నిన్ను స్మరించటం వలన అటువంటి అహంకారాన్ని నాకు తెలియకుండానే నాశనం చేస్తావు అరుణాచలా అంటున్నారు భగవాన్. నేను పెద్ద పెద్ద తపస్సులు, యజ్ఞాలు, దానాలు ఏమీ చేయలేదు. పెద్ద పెద్ద సాధనలు ఏమీ చేయకపోయినా, నాకు ఏమీ కష్టం లేకుండా నా అహంకారాన్ని తొలగించి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించావు. ఎవరో బంధువు అరుణాచలం అని చెప్పారు. అరుణాచలా, అరుణాచలా అన్నాను అంతే నా పని పూర్తి అయిపోయింది. నాలో పనికి రానిది తీసుకొన్నావు, నీలో ఉన్న మంచిని నాకు అనుగ్రహించావు, నీ ప్రేమ, నీ దయ, నీ వైభవం ఇట్టిదా అరుణాచలా! మన ప్రేమలు ద్వైత ప్రేమలు. దేవుడిని ప్రేమించేటప్పడు కూడా ద్వైతప్రేమలు, నీ చుట్టూ తిరుగుతాను నాకు ఏమి ఇస్తావు అంటాము, ఇటువంటి వ్యాపారస్థులకా జ్ఞానం కలిగేది. మంచిగా పుట్టరు, మంచిపనులు చేయరు, మేము గొప్పవారమని ఇతరులు అంగీకరించాలి అని ఇతరులను బాధ పెడుతూ ఉంటారు, ఇటువంటి జనంతో లోకం నిండి ఉంది అని షేక్స్‌పియర్ అన్నాడు. నేను గొప్పవాడిని అయిపోవాలి, పైకి వచ్చేయాలి, నాతో సమానమైనవాడు ఎవడూ ఉండకూడదు అని అందరి ఆలోచనలు ఇలా ఉంటాయి, లోపలకు వెళ్ళాలనే బుద్ధి ఎవడికీ లేదు. విషయసుఖాల మీద ఉన్న భ్రాంతిని పోగొట్టావు. నోటిలో మన్నును కొట్టటం అంటే భోగచింతన, విషయచింతన, లోకం గొడవ, దేహం గొడవ ఈ గొడవలు అన్నీ నా సాధన ఏమీ లేకుండా ఈ పెంట అంతా తీసి ఒక ప్రక్కన పెట్టావు. నీ దయ ఇట్టిదని ఎలా చెప్పగలము. జ్ఞానికి సంకల్పం, వికల్పం ఉండదు. వాడి ద్వారా ఏ పని జరగాలో ఆ పని జరిగిపోతుంది, ఆయన భగవంతుని చేతిలో పనిముట్టుగా ఉంటాడు.

మీరు ఏదైనా మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది, ఆ పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది కాని అజ్ఞానం నశించకుండా దుఃఖం నశించదు. ఏవో బాహ్యంగా కొన్ని మంచికర్మలు చేస్తే దుఃఖం నశిస్తుంది అనే భ్రాంతిలో ఉండవద్దు. ఆత్మజ్ఞానం పొందటానికి

తగిన స్థాయికి మనం రాకపోయినా మనందరం సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సత్వగుణం కూడా గుణమే కాని అది భగవదనుభవం పొందటానికి దారి చూపించి ప్రక్కకు తప్పకొంటుంది. మన మాట, ఆలోచన, ప్రవర్తన సాత్వికంగా ఉండాలి. మనమాట, ఆలోచన, చేత ఒకటిగా ఉండాలి, అప్పడు కదా నీవు పవిత్రం అయ్యేది. నీవు పరమపవిత్రుడవు అయితేగాని, హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు ఎరుకలోనికి రాడు. అరుణాచలేశ్వరుడు గొప్పవాడు, జ్ఞానం ఇస్తాడు అని నీ దగ్గరకు వస్తే నా బ్రతుకు నాశనం చేసావు. ఇది పైకి తిట్టినట్లుగా ఉంది కాని లోపల ఏమి చేసావు అంటే ఈ శవమే నేను, ఈ అజ్ఞానము నేను అనుకొంటున్నాను, ఈ అజ్ఞానము అనే బండరాయిని తొలగించావు. నాకు ఉన్న పాడుబుద్ధిని తొలగించావు, నిన్ను తెలుసుకొనే బుద్ధిని ప్రసాదించావు. నిన్ను తెలుసుకొనే బుద్ధిని ప్రసాదించటమే కాదు తెలియబడ్డావు. ఈ పని నీకు కాక ఎవరికి సాధ్యం. మన జేబులో ఉన్న డబ్బు అలాగే ఉండాలి, బజారులో ఉన్న వస్తువు కొనుక్కోవాలి అనుకోవటం ఎలాగ ఉంటుందో నాలో ఉన్న అజ్ఞానం అలాగే ఉండాలి నీలో ఉన్న జ్ఞానాన్ని ప్రసాదించు అని భగవంతుడిని అడగటం అలాగే ఉంటుంది. మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి, మీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా వేరుభావన ఉన్నంతకాలం మీకు దుఃఖం నశించదు, ఇందులో రాజీ లేదు.

నాకు ప్రపంచం మీద మోహం ఉంది, అది నీకోసం వదిలేసాను. ఇప్పడు నీ మోహంలో పడ్డాను. నీమీద నాకు ఉన్న ప్రేమ ద్వైతపరంగా ఉంది. ద్వైతంగా ఉన్న ప్రేమ ఎప్పడూ నిలబడదు. నీవు వేరు, నేను వేరు అనే బేదబుద్ధి ఉంది, దానిని పోగొట్టటానికి నీవే సమర్థుడివి. నీ అనుగ్రహం వలన బేదబుద్ధిని పోగొట్టి రెండులేని స్థితికి, అద్వైతానుభవానికి నన్ను తీసుకొనివెళ్ళు అరుణాచలా అంటున్నారు భగవాన్. గీతలో పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నీ అజ్ఞానాన్ని నీవు పోగొట్టుకోగలవా? అది నిజం అని అనుకొంటున్నప్పడు నీవు దానిని ఎలా పోగొట్టుకోగలవు. అర్జునా! అక్కడ ఆగు. అజ్ఞానం పెరిగే పనులు నీవు చేస్తూ నీ అజ్ఞానం పోవాలంటే అది ఎలా పోతుంది. నీ ఇష్టం, అయిష్టాలను ఒక ప్రక్కన పెట్టి నాకు ఇష్టమైన పనులు చేస్తూ ఉంటే, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే, నాకు ఇష్టమైన పనులు చేయటమే కాదు నీవు పొందవలసిన వాడిని నేనే అనే భావన కలిగి ఉంటే, ఏ ప్రాణి పట్ల విరోధం పెట్టుకోకుండా నన్నే పురుషోత్తముడిగా ఎంచుకొని జీవిస్తూ ఉంటే నీకు నేను సద్బుద్ధిని, సహృదయాన్ని ఇస్తాను. సద్బుద్ధి వలన, సహృదయం వలన నన్ను తెలుసుకోగలవు అర్జునా! అని పరమాత్మ చెప్పాడు. అరుణాచలం మన మాంసపు నేత్రాలకి రాళ్ళగుట్టగా కనిపించినా అది శాంతిగిరి, జ్ఞానగిరి, మనలో ఉన్న

అపవిత్రతను దహించే అగ్ని అదే అరుణాచలేశ్వరుడు. ఈ జగత్తుకు ఎవడైతే ఆధారమో వాడే ఇక్కడ కొండరూపంలో ఉన్నాడు, జ్యోతిరూపంలో వెలిసాడు. నీవు అగ్నిలాంటి వాడివి మనస్సుతో నిన్ను స్మరిస్తూ ఉంటే నా అజ్ఞానాన్ని అంతా కాల్చి బూడిద చేస్తావు. శరీరంలో కుట్ర చేరితే రోగాలు వస్తాయి, మనస్సులో కుట్రచేరితే దానిని అనుభవించటానికి నీచాతినీచమైన జన్మలు వస్తాయి. డాక్టరు కురుపులో ఉన్న చీమును ఎలా తీసేస్తాడో అలాగే నీవు గురువుగా ఉండి నిన్ను తెలుసుకోవటానికి నాకు అడ్డువస్తున్న విషయవాసనలను బయటకులాగి కాల్చి బూడిద చెయ్యి అరుణాచలా అంటున్నారు. నాలో ఉన్న చెడ్డగుణాలను తొలగించి నన్ను వదిలేయకు మంచిగుణాలతో అలంకరించు. మంచిగుణం కూడా గుణమే కాని అది నిన్ను తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది.

గాఢనిద్రలో మనం స్త్రీ అనుకోము, పురుషుడు అనుకోము, మనకు కాలం గొడవలేదు, విరోధుల గొడవలేదు, స్నేహితుల గొడవలేదు, జన్మల గొడవలేదు, ఏ గొడవలేదు కాని మనం ఉన్నామా, లేదా అంటే మనం ఉన్నాము, అది మనం అందుకోవాలి. మహిమలకు కూడా మీరు ఆకర్షింపబడవద్దు. మీలోపల అజ్ఞానం పోయిందో లేదో చూసుకోండి. రామకృష్ణుడి దగ్గరకు ఒకడు మహిమలు నేర్చుకొని వచ్చాడు. రామకృష్ణుడు కాలువ దాటటానికి బల్లకట్టు ఎక్కుతూ ఉంటే మీరు కాలువ దాటాలంటే బల్లకట్టు ఎక్కాలి నేను నీటిమీద నడిచి వెళ్ళిపోతాను అన్నాడు. రామకృష్ణుడు మెచ్చుకొంటాడు అని వాడు అనుకొన్నాడు కాని ఆయన మెచ్చుకోలేదు. నీ జీవితంలో కష్టపడి నేర్చుకొన్నది పది పైసల విలువ అన్నారు. అదేమిటి అన్నాడు? నేను బల్లకట్టు మీద వెళ్ళటానికి పది పైసలు ఖర్చు అవుతుంది. ఆ పది పైసలు ఖర్చు అవ్వకుండా నీవు నీటిమీద నడిచి వెళుతున్నావు. అంతకంటే ఏమీ లేదు. నీవు కష్టపడి నేర్చుకొన్నది జ్ఞానం కాదు. అజ్ఞానంలో నుండి ఎలా బయటకురావాలో నేర్చుకోలేదు. పది పైసలు విలువ చేసే విద్య నేర్చుకొన్నావు, నీవు ఈ భూమి మీదకు వచ్చింది ఇందుకా అన్నాడు. మన శరీరం ఏదో రోజు చనిపోతుంది. ఆరోజు మీరు సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉండగలిగితే మీకు పునర్జన్మ లేదు, మీ ప్రాణ ప్రయాణం ఆగిపోతుంది, హృదయంలో ఐక్యం అయిపోతుంది. నీమీద ఆకర్షణ కలిగేలా నీవే చేయాలి, నిన్ను అంటిపెట్టుకొని ఉండేలా నీవే చేయాలి, ఇతరతలంపులు రాకుండా నీవే చూసుకోవాలి. పరమస్థితిని పొందేలాగ నీవే చేయాలి. ఎప్పుడోకాదు ఇప్పుడే, ఎక్కడో కాదు ఇక్కడే. ఈ శరీరం మట్టిలో కలిసాక నీవు చేసేది ఏముంది? ఈ శరీరం భూమి మీద తిరుగాడుతుండగానే నన్ను అనుగ్రహించి ఇటువంటి శవాలను ఇంక మోయనక్కర లేకుండా

నన్ను జ్ఞానంతో అలంకరించు అరుణాచలా అంటున్నారు. అనుగ్రహం గురువు యొక్క గుణం కాదు, గురువు యొక్క స్వరూపమే అనుగ్రహం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-12-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు భగవాన్ జయంతి, భూమికి వెలుగు. మాసములలో మార్గశిర మాసము భూషణం లాంటిది అని వాల్మీకి చెప్పారు. అటువంటి మార్గశిరమాసంలో సోమవారం రోజున పునర్వసు నక్షత్రంలో రమణమహర్షిగారు శరీరం తీసుకొన్నారు. రమణస్వామి తిరుచ్చుళిలో శరీరం తీసుకొన్నారు. ఆయన మధురైలో హైస్కూలులో చదువుతూ ఉండగా మరణానుభవం కలిగింది. ఆయన తపస్సులు చేసి, యజ్ఞాలు చేసి, అధ్యయనం చేసి, బ్రహ్మం గురించి శ్రవణం చేసి మననం చేసి, జపధ్యానములు చేసి బ్రహ్మంను పొందలేదు అయితే రమణమహర్షికి జ్ఞానం ఎలా వచ్చింది అంటే ఈశ్వరుడే ఆయనను జ్ఞానసింహాసనం మీద కూర్చోబెట్టాడు. బాగా ఎండిపోయిన పుల్లకు ఒక్క అగ్గిపుల్ల వెలిగిస్తే సరిపోతుంది, అలాగే భగవాన్ అంతకు ముందే పక్వతకు వచ్చేసారు. ఆయన బంధువు ద్వారా అరుణాచలం పేరు వినటం, అరుణాచలంతో ఆకర్షింపబడటం జరిగింది, అరుణాచలం అనే స్మరణ మాత్రం చేతనే ఆయన జ్ఞానసింహాసనం మీద అధిష్టింపబడ్డాడు. బంధువుని ఎక్కడ నుండి వస్తున్నావు అని అడిగితే అరుణాచలం నుండి వస్తున్నాను అన్నాడు. ఏమిటి అరుణాచలం నుండి మనిషి వస్తాడా? అంటే ఆయనకు అరుణాచలం అంటే భగవంతుడు అనే స్ఫురణ వచ్చింది. ఆ ఊరు పేరు అరుణాచలం, అక్కడ కొండపేరు అరుణాచలం, దేవుడు పేరు అరుణాచలం, ఆ ఊరు నుండే వస్తున్నాను అని బంధువు చెపితే భగవాన్‌కు అర్థం కాలేదు. భగవాన్ దగ్గరకు అనేకమంది భక్తులు వచ్చేవారు. కొత్తవారు ఎవరైనా దగ్గర కూర్చొంటే వీరు ఎవరు అని భగవాన్ దగ్గర ఉన్నవారు అడిగితే ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, మనవారు కాబట్టే మన దగ్గరకు వచ్చారు అనేవారు భగవాన్ అంటే అనుబంధాన్ని చెప్పకుండా చెప్పటం.

మరణానుభవం ద్వారా భగవాన్‌కు స్ఫురించింది ఏమిటి అంటే దేహంతో ఆయనకు ఎట్టి సంబంధం లేదని అనుభవం కలిగింది. ఈ శరీరం శవం అయిపోయింది, దీనిని స్మశానంకు తీసుకొనివెళ్ళి కాలిస్తే బూడిద అవుతుంది, కప్పెడితే మట్టి అవుతుంది. ఈ శరీరంతో పాటు నేను కూడా పోవాలి కదా, నేను పోలేదు, నేను ఉన్నాను అని నాకు తెలుస్తోంది, ఈ శరీరానికి నాకు ఎట్టి సంబంధం లేదు అని తెలుస్తోంది అంటే శరీరానికి మరణం రాకముందే మరణరహితస్థితిని పొందాడు, మరణానుభవం ద్వారా మరణాన్ని ఓవర్‌కమ్ చేసాడు. దేహం

చనిపోవటానికి మనం సాధన చేయనక్కరలేదు, ప్రకృతే తీసుకొనిపోతుంది. దేహగతమైన నేను నుండి విడుదల పొందటానికే సాధన అవసరం. ఈ నేను అనే తలంపు వచ్చినప్పడే దేహం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు, రాగద్వేషాలు, లోకం కనిపిస్తున్నాయి. గాఢనిద్రలో ఎవరికి నేను అనే తలంపు లేదు, నేను అనే తలంపు లేనప్పడు ఏ గొడవలు లేవు. ఏది వచ్చిన తరువాత అన్నీ వస్తున్నాయో దానిని విచారణ చెయ్యి. భగవాన్ కేవలం జ్ఞానం గురించే చెప్పారు అనుకోకండి, ఆయన శరణాగతి గురించి కూడా చెప్పారు. భక్తిలో ద్వైతం ఉంది, శరణాగతిలో అద్వైతం. గాఢనిద్రలో మనకు దేవుడు గురించి, లోకం గురించి, దేహం గురించి, విషయాల గురించి గొడవ ఏమీలేదు, మనం కానిదానిలో నుండి పూర్తిగా విడిపోతున్నాము. అలా భగవాన్ మరణానుభవం ద్వారా జాగ్రదవస్థలో అన్నింటిలో నుండి విడిపోయారు, కొన్ని క్షణాల టైములో భగవదనుగ్రహం వలన జ్ఞానసింహాసనం మీద అధిష్టింపబడ్డారు, లోకగురువు అయ్యారు.

అరుణాచలేశ్వరుడి మీద భగవాన్‌కు జనకభావన ఉండేది. భగవాన్ అరుణాచలం రాగానే ఓ తండ్రీ నువ్వు రమ్మంటే వచ్చాను, ఈ దేహాన్ని ఎలా ఉపయోగించుకోవాలంటే అలా ఉపయోగించుకో, నీ సంకల్పమే నెరవేరుగాక అని శరణాగతి చేసాడు. మరణానుభవం లోనే వేరుభావన పూర్తిగా నశించింది. అన్ని యోగాలలో కూడా మనస్సును ఉపయోగిస్తారు, భగవాన్ చెప్పిన విచారణమార్గం మనోమూలాన్ని వెతకటం. దేహం చనిపోయినప్పడు నేను చనిపోతున్నాను అని అంటాము. నేను చనిపోతున్నాను అని దేహం చెప్పటం లేదు. దేహము నేను అని చెప్పేవాడు లోపల ఒకడు ఉన్నాడు. వాడు దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాడు కాబట్టి దేహం పోయినప్పడు నేను పోతున్నాను అంటున్నాడు కాని అది నిజం కాదు. దేహానికి చావు రాకముందే దేహంతో తాదాత్మ్యం పొందే నేనును సాధన చేసి చంపగల్గితే నువ్వు ఇంక శవాలను మోయనక్కరలేదు. జ్ఞానమార్గంలో డిటాచ్‌మెంట్ ముఖ్యం, విచక్షణ ముఖ్యం. అరుణాచలేశ్వరుడు తిరుచ్చుళిలో శరీరం ధరించి అరుణాచలం వచ్చి కొంతకాలం ఇక్కడ తిరుగాడి మరల అరుణాచలంలో ఐక్యమయ్యాడు కాని రమణ మహర్షిగారు అరుణాచలం రావటం కాదు, ఆయన ఇంటికి ఆయన వచ్చేసాడు. మనం గుడికి వెళ్ళినప్పడు భగవంతుడితో నీ ఇష్టమే నెరవేరుగాక మేము వూరికే బొమ్మలం మాత్రమే, నువ్వు ఎలా ఆడిస్తే అలా ఆడుతాము, నీ సంకల్పమే నెరవేరుగాక అని అంటాము మరి ఇంక మీకు బెంగ ఎందుకు వస్తోంది? అంటే మీరు చెప్పే మాటలు నిజం కాదు. పుస్తకాలలో చదివి చిలుక పలుకలు పలుకుతున్నారు. మీరు అనేమాట నిజం అయితే మీకు ఎందుకు

దుఃఖం వస్తోంది. మీరు అన్నమాట నిజమైతే మీకు దుఃఖం రాదు, అది నిజమైతే మీరు దుఃఖం లేనిస్థితికి వెళ్ళిపోతారు.

భగవాన్ శరీరం 54 సంవత్సరాలు అరుణాచలంలో తిరుగాడింది. ఒక్కసారి కూడా ఈ అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళిపోదామనే తలంపు ఆయనకు రాలేదు, ఆయన రమణస్వామి, అంటే 100% డిటాచ్‌మెంట్. బ్రహ్మానుభవం పొందిన తరువాత ఇప్పటి వరకు విన్నదానిమీద, చూచినదానిమీద మీకు రోత పుడుతుంది, అది సుప్రీమ్ స్టేట్, ఇంకో దానితో దానిని పోల్చటానికి లేదు. కాశీ అవి చూడటానికి రమ్మని భగవాన్‌తో అనేవారు. అక్కడ చూడటానికి ఏముంది, మన కంటే భిన్నంగా ఏమీ లేదే అనేవారు భగవాన్. గురువు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నాము, గురువును పొందటం ఎలా అనుకొంటున్నాము మన చేత గురువును పొందింపచేసేవాడు గురువే. గమ్యం మాత్రమే గురువు కాదు మార్గం కూడా గురువే. అది మనం మిస్ అయిపోతున్నాము, అది మన అవగాహనకు అందటం లేదు. దేహం మరణించాక మనకు బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరాలతోటి, ఆస్తిపాస్తులతోటి సంబంధం తెగిపోతుంది. ఒక్క గురువుతో తప్పించి అన్నింటితో సంబంధం తెగిపోతుంది. గురువు ఆత్మ అయి ఉన్నాడు, గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మీరు పొందేవరకు మిమ్మల్ని ప్రతీ జన్మలోను వెంటాడుతూ ఉంటాడు. మీ లోపల ఉన్న బలహీనతలను మీకు చూపిస్తూ, వాటిని తొలగించుకొనే శక్తిని ఆయనే ఇస్తూ, వాటిని తొలగించి మిమ్మల్ని పక్వం చేస్తూ ఆయన స్వరూపాన్ని మీకు ఇచ్చేవరకు జన్మజన్మలకు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాడు, వాడు గురువు.

మీరు ఆనందం కోసం వెతుక్కోవటం కాదు. సబ్జక్టు మీకు అవగాహన అవుతూ ఉంటే ఆపుకోలేని ఆనందం, శాంతి వచ్చి మిమ్మల్ని ముంచేస్తుంది, దీనిని భరించటం ఎలాగ అనే ప్రశ్న మీకు వస్తుంది. మన హృదయంలో ఉన్న ఆనందం, శాంతి మనకు అందకుండా దేహగతమైన నేను మూతలాగ అడ్డువస్తోంది. నువ్వు ఎన్ని సాధనలు చేసినా ఆ మూతను తీయలేకపోతున్నావు. మీరు సంవత్సరాల తరబడి సాధన చేస్తున్నామ అంటున్నారు, ఇంత సాధన చేస్తూ ఉంటే మీలో ఎవరైనా ఒక్క అంగుళం లోపలకు దిగారా? అది చూసుకోవాలి. మీరు ఈ శరీరం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము. మేము ఎక్కడో ఇతరదేశాలనుండి వచ్చాము, మామాట ఏమిటి అని చివరిరోజులలో భగవాన్‌తో ఒక భక్తుడు అంటే పూర్వజన్మలలో ఏమీ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా, ఈ సంబంధం మనలను మరొకచోట కలపదా అన్నారు భగవాన్. భయం ఎక్కువగా

ఉన్నవారు రోజూ గీతలో 16వ అధ్యాయం చదివితే భయం పోతుంది. 1912వ సంవత్సరంలో విరూపాక్షగుహలో మొదటగా భగవాన్ పుట్టినరోజు చేయటం ప్రారంభించారు. అప్పుడు భగవాన్ ఏమిచెప్పారు అంటే ఈ శరీరం పుట్టుక పుట్టుకకాదు, శరీరం మరణం మరణం కాదు. నేను అనే తలంపు వచ్చాక శరీరం వస్తోంది. కనీసం ఈ శరీరం పుట్టినరోజున అయినా ఈ నేను అనే తలంపు ఎక్కడనుండి వస్తోంది, ఎలా వస్తోంది అని విచారణ చెయ్యండి. ఈ నేను అనే తలంపును ఉపసంహరించి, ఉపసంహరించి దాని మూలం లోనికి వెళితే అక్కడే చైతన్యం ఉంది, అక్కడే ఆనందం ఉంది. ఈ మూలతలంపు మూలాన్ని మీరు సముద్రం అనుకొంటే, ఈ మూలతలంపు బుడగ మాత్రమే. ఈ మూలతలంపును దాని మూలంలోనికి తీసుకొనివెళితే ఈ బుడగ పగిలిపోతుంది, సముద్రం అయి కూర్చొంటుంది. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. ఈ మూల తలంపు పోతే మీరు పోతారు అనుకొంటున్నారు గాని మీరు పోరు, మీరు ఎవరో మీకు తెలియబడుతుంది. అప్పుడు శాంతి ప్రవహిస్తుంది, శాంతికోసం మీరు వెతుక్కోవటం కాదు, ఈ శాంతిని ఎలాగ భరించాలి అనే ప్రశ్న వస్తుంది. భగవంతుడు ఇప్పుడు కూడా శాంతి అనే కుళాయిని విడిచిపెట్టటానికి రెడీగా ఉన్నాడు కాని మీకు మెచ్యూరిటీ లేదుకాబట్టి దానిని భరించలేక చస్తారని కొంచెం వెయిట్ చేస్తున్నాడు.

రమణావతారంలో అంతా టీచింగే. ఆయన ఏదైతే టీచ్ చేస్తున్నాడో అది మీకు అనుభవంలోనికి తీసుకొని రావటమే పనిగా పెట్టుకొన్నాడు. ఇక్కడ శిక్షించటం లేదు అంతా రక్షించటమే. మీ అనుగ్రహం మాకు కావాలి అని భగవాన్‌తో ఎవరైనా అంటే ఈశ్వరానుగ్రహం మీకు ఉంటే మా అనుగ్రహం కూడా మీకు ఉన్నట్లే అనేవారు. గురువును తెలుసుకోవటం ఎలాగ? నీ మనస్సు నిర్మలం అవ్వటం వలన, నిశ్చలం అవ్వటం వలన నీకు గురువు గురించి తెలుస్తుంది. అనేకమంది మహర్షులు ఉన్నారు. నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఎవరి సమక్షంలో శాంతిని, ఆనందాన్ని పొందుతున్నావో, ఎవరితో అయితే నీ మనస్సు శ్రుతి కలుపుతోందో వాడే నీకు గురువు. గురువు ఇట్టివాడు అని చెప్పటానికి నువ్వు మాటలతో చెప్పలేవు, మనస్సుతో ఊహించలేవు. ఎక్కడయితే మాట, మనస్సు అణిగిపోయాయో అక్కడ నీకు గురువు వైభవం తెలుస్తుంది. గురువు పట్ల అద్వైతం పనికిరాదు. ధ్యానం చేసేటప్పుడు కళ్ళు మూసుకోమంటారా? తెరుచుకోమంటారా? అని కొంతమంది అడుగుతారు. ఈ కళ్ళలో ఏముంది? ఈ కళ్ళ ద్వారా చూసేది, చెవుల ద్వారా వినేది మనస్సు. ఆ మనస్సు అణుగుతోందో లేదో చూసుకో అది ముఖ్యం. ఏ వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం

చేస్తున్నామో ఆ వస్తువు యొక్క దయ లేకుండా దానిని పొందలేము. మనకు ఎంత చదువు ఉన్నా, ఎంత ధనం ఉన్నా, ఎన్ని సాధనలు చేసినా గురువు యొక్క కృప లేకుండా జ్ఞానం కలుగదు.

ఏది వచ్చాక మిగతావి అన్నీ వస్తున్నాయో దానిని ఎందుకు పట్టుకోవటం లేదు, నువ్వు ఎవరో నువ్వు తెలుసుకోవటానికి ఎందుకు ప్రయత్నం చేయటం లేదు. ఎందుకు నీ కాలాన్ని, శక్తిని వృధా చేసుకొంటున్నావు అని అడుగుతున్నారు. నువ్వు కాని వాటితో తాదాత్మ్యం పొందుతున్నావు. ఈ తాదాత్మ్యం పొందే నేను ఎవరు అని ఆ నేను గురించి విచారణ ఎందుకు చేయటం లేదు. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీకు నేను అనే తలంపు ఉంది. ఆ నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆ నేను అనే తలంపు నీ లోపల నుండే వస్తోంది. ఆ మూలతలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడకు ఉపసంహరించి దాని మూలంలోనికి వెళ్ళగలిగితే దేవుడు అక్కడే ఉన్నాడు అని నీకు అనుభవైకవేద్యం అవుతుంది. మనం నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉంటే శాస్త్రం గొడవగాని, దేవుడు గొడవగాని, దేహం గొడవగాని అక్కరలేదు, చావుపుట్టుకలతో పనిలేదు. ఉండటమే ఉండటం. అప్పుడు దేవుడు కనిపిస్తే ఏమిటి? కనిపించకపోతే ఏమిటి? చావు వస్తే ఏమిటి? రాకపోతే ఏమిటి? వాటివలన నీకు ఏమీ తేడా అనిపించదు. గాంధీగారు భార్యకు ఉత్తరం వ్రాస్తూ డాక్టర్లు నీవు ఎంతో కాలం బతకవని ఉత్తరాలు వ్రాస్తున్నారు. నేను చెప్పే సలహా ఏమిటి అంటే నీవు కాలాన్ని వృధా చేసుకోవద్దు. డాక్టర్లు చెప్పినంత మాత్రంచేత నీవు చనిపోవు. దేవుడు నీవు ఎంత కాలం ఉండాలి అని నిర్ణయించాడో అంతకాలం ఉంటావు. నేను వెంటనే రాలేకపోతున్నాను, బాపూజీ రాలేదు అని ఆగొడవలో ఉండవద్దు. దేహం చనిపోయిన తరువాత మనం ఉండము అని అనుకోవటం వలన మనకు భయం కలుగుతోంది. దేహం చనిపోయిన తరువాత కూడా మనం ఉంటాము. నీ దేహానికి చావు రాకముందే ఎప్పుడూ ఉండే దానిని అనుభవంలోనికి తెచ్చుకొంటే నీకు మరణభయం పోతుంది. ఇప్పుడు నీవు చేయవలసిన పని అది అని గాంధీగారు భార్యకు ఉత్తరం వ్రాసారు. నీవు పొందవలసింది పొందావు అనుకో నేను వస్తే ఏమిటి? రాకపోతే ఏమిటి?

మన హృదయంలో ఒక నిజం ఉంది. నీవు ఎన్ని సాధనలు చేసినా గురువు యొక్క దయ లేకుండా అది నీకు తెలియబడదు. ఆ నిజం గురువు అయి ఉన్నాడు. ఆ నిజమే కాళ్ళు చేతులు తొడుక్కొని వచ్చింది, వాడిని మీరు శరీరమాత్రుడుగా చూస్తున్నారు, అక్కడే

మీరు మిస్‌అయిపోతున్నారు. ఏది తెలుసుకొన్నాక అన్నీ తెలియబడతాయో అదే బ్రహ్మం, వాడే గురువు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలియకపోవచ్చు కాని నీవు అనుకొనేది నిజం కాదు. నీకు నిజం తెలిసేవరకూ నిజం కానిది నీకు నిజంగా అనిపిస్తుంది. సూదంటు రాయి ఇనుమును ఎలా ఆకర్షించుకొంటుందో అలాగ ఆయన భక్తులను చూపులతో ఆకర్షిస్తాడు, మౌనంతో ఆకర్షిస్తాడు, మాటలతో నిన్ను కట్టేసుకొంటాడు. నిన్ను ఎలా అనుగ్రహించాలో, ఎప్పుడు అనుగ్రహించాలో ఆ ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు, దాని గొడవ నీకు వద్దు. గురువు మీద మీకు భక్తి కలుగుతూ ఉంటే అది మీ తెలివి తేటల వలన కాదు, గురువే మిమ్మల్ని తలపెట్టుకొంటున్నాడు కాబట్టి ఆయన మీకు జ్ఞాపకం వస్తున్నాడు. పూర్వ పుణ్యం వలన ఇక్కడకు ఆకర్షింపబడ్డారు, మీరు అందరూ తరిస్తారు. మీలో అందరూ ఎసి పాసింజర్లు అన్నారు భగవాన్. ఎసి కంపార్టుమెంటులో కండక్టరు ఉంటాడు వాడు మన స్టేషన్ వచ్చేముందు చెపుతాడు, మీరు వర్రీ పడనక్కరలేదు. మీ సాధన, మీ గమ్యం, మీ మార్గం అన్నీ గురువే. మీ హృదయంలో ఉన్న నిజం తెలిసాక అదే గురువు అని మీకు తెలుస్తుంది, అప్పుడు విశ్వం అంతా గురువే కనిపిస్తాడు. హృదయంలో ఏదో నిజం ఉందని చెపుతున్నారు, దానిని తెలుసుకోవటానికి సహాయ సహకారములు అందిస్తారా అని భగవాన్‌ను అడుగుతున్నారు. సహాయం ఎప్పుడూ ఉంటుంది, అది నీవు గుర్తించలేకపోవచ్చు. శ్రవణం చేయటం, మననం చేయటం, తెలుసుకోవాలి అనే కాంక్ష రావటం ఇది అంతా గురువు దయే. గురువు యొక్క దయలేకపోతే నీ సాధన వాలుగాలిలో సైకిలు తొక్కినట్లుగా సాగదు. భగవాన్ అనుగ్రహం మనకు లేదు అనుకోవటం అది నీ తలంపే కాని భగవాన్ అనుగ్రహం లేకపోవటం కాదు. అనుగ్రహం నెమ్మదిగా విడిచిపెడుతున్నాడు, ఒక్కసారి ఇస్తే మీకు ఊపిరి ఆగిపోతుంది. భగవాన్ దగ్గరకు ఒక ఆయన వచ్చి మిమ్మల్ని నేను డైరెక్టుగా అడుగుతున్నాను ఔను అంటే ఔను లేకపోతే కాదు అని చెప్పండి, మీరు నాకు మోక్షాన్ని ఇవ్వగలరా అన్నాడు. నేను మోక్షాన్ని ఇస్తాను, నీవు రెడీగా ఉన్నావా అన్నారు భగవాన్. వెంటనే వాడికి భయం, వణుకు వచ్చేసింది. ఎందుచేతనంటే వాడికి ప్రిపరేషన్ లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు గీతా జయంతి. భగవద్గీత గ్రంధాలన్నింటికి రాజులాంటిది. భగవద్గీతలో లేనిది ఈ ప్రపంచంలో లేదు. ఈ రోజున కురుక్షేత్రంలో మహాభారత యుద్ధ ప్రారంభం ముందు అర్జునుడి దుఃఖం పోగొట్టటం కోసం కృష్ణుడిచేత ఈ భగవద్గీత చెప్పబడింది.

కృష్ణుడు అంటే మనలాంటి మనిషి అని అనుకోవద్దు. మీ అందరి హృదయాలలో ఏ నిజం అయితే ఉందో అది నేనే, ఆ చైతన్యం నేనే అని ఆయనే చెప్పాడు. కృష్ణుడు కృష్ణుడిగా గీతను చెప్పలేదు, భగవంతుడై గీతను చెప్పాడు, అందుచేత భగవద్గీత అయ్యింది. అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాడు. మనం చేసే పనికి, మాట్లాడే మాటకు, మనకు వచ్చే ఆలోచనలకు సాక్షిగా ఉన్నాడు. అందరూ నిద్రపోయిన ఆయన నిద్రపోడు. మూడు గుణాలకు, మూడు అవస్థలకు ఆయన అతీతుడు, వాడే నారాయణుడు, వాడే కృష్ణుడు. అందరి హృదయాలలో స్వయంగా ప్రకాశించే జ్యోతిని నేను, ఈ సృష్టి స్థితిలయములు చేసే వాడిని నేను, ఈ జీవకోటికి ఆది నేను, అంతం నేను, ఈ ప్రపంచానికి అధ్యక్షుడిని నేను, నాకు తెలియకుండా ఏదీ జరగదు. వర్షం తెచ్చేవాడు ఆయనే, ఆపుచేసేవాడు ఆయనే, నీకు వచ్చే సుఖం దుఃఖం ఆయనే. అంతా ఆయనే అని చెప్పటం కంటే ఉన్నదే ఆయన. మీరు తెలుసుకోవలసింది నన్నే. మీరు నన్ను తెలుసుకొంటేనే మీకు మోక్షం. అంతవరకు మీకు మోక్షం లేదు, పరమపదవిని పొందలేరు అని చెప్పాడు. ఆయన ప్రీతికోసం మనం పనిచేస్తూ ఉంటే, ఆయన కోసమే జీవిస్తూ ఉంటే ఆయన తెలియబడతాడు.

లోకం గొడవలలో ఎక్కువగా కలుగజేసుకోవద్దు. లోకం గొడవలలో ఎక్కువగా కలుగజేసుకొంటే మనకు అజ్ఞానం పెరుగుతుంది. కొంతమంది వారి పనివారు చేసుకోవటం మానివేసి బజారు గొడవలు భుజాన వేసుకొని తిరుగుతారు, వారు ఇంటికి, దేశానికి కూడా పనికిరారు. మీ పని ఏదో మీరు చేసుకోండి. అక్కరలేని గొడవలలోనికి వెళితే అజ్ఞానం పెరుగుతుంది, అదే బంధం. నేను కర్తను అనుకొనేవాడికి సుఖం ఉంది, దుఃఖం ఉంది, చావు ఉంది, పుట్టుక ఉంది అన్నీ ఉన్నాయి. నేను కర్తను కాదు అనుకొంటే ఏమీలేదు. చావుపుట్టుకలు లేనివాడిని, ఎప్పడూ ఉండేవాడిని నేనే, ఈ దేహంలో ఉన్నా నేను దేహమాత్రుడిని కాదు, మీ కోసం ఒక దేహం ధరించి వచ్చాను అంతకంటే ఈ దేహంతో పనిలేదు అని పరమాత్మ చెపుతున్నాడు. అజ్ఞానం నశించటానికి కేవలం మీ సాధన, మీ తెలివి సరిపోదు. నేను పుట్టలేదు పుట్టిన వాని వలె కనిపిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. నేను పుట్టకపోతే దేవుడు లేడు అంటున్నారు, పుడితే అవమానాలు చేస్తున్నారు. ఈ లోకంతో ఎవడు పడగలడు అంటున్నారు. శరీరం ధరించి వచ్చినా మీకు గుర్తించే శక్తి లేదు. ఒక మంచిమనిషిని గుర్తించే శక్తే మనకు లేదు. ఇంక భగవంతుడిని ఎలా గుర్తించగలము. ఆయన మన చేతలకు, ఊహలకు, మనస్సుకు అందడు. మన పాడుబుద్ధితో ఆయనను తెలుసుకోలేము. నాకు ఇష్టమైన పనులు మీరు చేస్తూ ఉంటే, నిరాడంబరంగా

నిరహంకారంగా జీవిస్తూ ఉంటే, నాయందు భక్తి కలిగి ఉంటే మీకు బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాను అంటే నన్ను తెలుసుకొనే బుద్ధిని ఇస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు.

భగవంతుడిని తప్పించి మీరు ఎవరినీ మీ మనస్సులో మోయవద్దు, అన్నింటిని మనస్సులో మోస్తూ ఉంటే బతికి ఉండగా దుఃఖం, అశాంతి, చనిపోయాక నరకం మిగులుతుంది. ఎవరితోటి, దేనిలోను అతిగా ఉండవద్దు. ఆహారం విషయంలో, విహారం విషయంలో, సహవాసం విషయంలో నియమం అవసరం. అన్నింటిలోను నియమంగా ఉంటే కదా నీకు యోగం సిద్ధించేది అంటున్నాడు పరమాత్మ. ఐన్‌స్టీన్ ఒకమాట చెప్పాడు. దేవుడు ఉన్నాడో లేడో నాకు తెలియదు, కళ్ళకు కనిపిస్తున్న ఈ లోకం సత్యమా అసత్యమా అంటే నేను చెప్పలేను కాని ఒక్కటిమాత్రం నిజం మనిషిలో మూర్ఖత్వం, అజ్ఞానం ఉండటం నూటికి నూరుపాళ్ళు నిజం అని చెప్పాడు. సంఘదోషం పనికిరాదు, నీకు సంఘదోషం లేకపోతే దుఃఖమే లేదు అర్జునా అన్నాడు పరమాత్మ. ఈ మాటలు అన్నీ ఏవో పుస్తకాలు చదివి చెప్పిన మాటలు కాదు. మనం ఏ వస్తువునయితే తెలుసుకొందాము అనుకొంటున్నామో ఆ వస్తువే ఒక నోరుపెట్టుకొని మాట్లాడుతోంది. నీవు నోటితో తీసుకొనేదే ఆహారం కాదు. మనం మంచిమాటలు వినాలి, మంచివిషయాలు చూడాలి, మీరు చూసేది, వినేది కూడా ఆహారమే. మీరు మంచిపనులు చేస్తూ ఉంటే నేను మంచి పనులు చేస్తున్నాను అని అస్తమానూ వాటిని తలచుకోకూడదు. చేసి మర్చిపోవాలి. వాటిని బుర్రలో మోయకూడదు, దానివలన కొత్త వాసనలు, సంస్కారాలు వస్తాయి. ఇవిఅన్నీ నరకానికి మెట్లు.

అహంకారం ఉన్నవాడికి గౌరవం, అగౌరవం. అహంకారం లేనివాడికి గౌరవం ఏమిటి? అగౌరవం ఏమిటి? బట్టలను గజం బద్దతో కొలుస్తారు. ఆత్మను వదిలేసి మీ గౌరవాలను, డబ్బును బట్టలు కొలచినట్లుగా కొలుచుకొంటూ ఉంటే బతికిఉండగా నీకు అశాంతి, చనిపోయిన తరువాత నరకం. మీరు పొందవలసిన దానిని దృష్టిలో పెట్టుకోవటం లేదు అందుచేతనే అవసరం లేని విషయాలు వస్తున్నాయి. భగవంతుని తెలుసుకోవాలనే గమ్యం లేని మనస్సు ఎటువంటిది అంటే దీపంలేని ఇల్లు వంటిది అని చెపుతారు. భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే అజ్ఞానం పోగొట్టుకొనే మార్గం ఆయనే చూపిస్తాడు. మార్గం ఆయనే, గమ్యం ఆయనే, అన్నీ ఆయనే. భగవద్గీతను గీతామాత అంటారు. తల్లికంటే మనలను ఎక్కువ ప్రేమించేది గీత, మనలో ఉన్న అశాంతిని పోగొట్టేది గీత. మాతల్లిగారు చిన్నప్పుడే పోయారు. గీతను అధ్యయనం చేయటం వలన, ఆ మాటలను స్మరించుకోవటం వలన

తల్లిలేని లోటు నాకు ఎప్పుడూ కలుగలేదు. నాకు ఏమైనా సందేహాలు వస్తే ఏదో శ్లోకంలో సందేహాలు తీరిపోయేవి. నాకు తల్లికంటే ఎక్కువ భగవద్గీత అని గాంధీగారు చెప్పారు. జ్ఞానం లేకుండా సుఖంలేదు, శాంతిలేదు, మృత్యువు నుండి అమృతత్వంలోనికి రాలేడు. జ్ఞాని, నేను వేరుకాదు, జ్ఞాని ఆత్మ అయి ఉన్నాడు, జ్ఞానికి పెట్టే నమస్కారం నాకు అందుతుంది అని పరమాత్మ చెపుతున్నాడు.

ఆత్మ రూపరహితం, నామరహితం అందుచేత ఆత్మమీద మీరు మనస్సు నిలబెట్టటం కష్టం అవ్వవచ్చు. భగవంతుడు అనేక రూపాలలో అవతరించాడు. మీకు నచ్చిన అవతారాన్ని ఆశ్రయించండి, ఆ నామాన్ని స్మరించుకోండి, ఆ రూపాన్ని ధ్యానించుకోండి. మీరు ఏ రూపాన్ని, ఏ నామాన్ని ఆశ్రయించినా లోపల అంతర్యామిగా ఉన్న వాడిని నేనే, మీకు జ్ఞానాన్ని ప్రసాదించే వాడిని నేనే అంటున్నారు పరమాత్మ. మీరు చేసిన మంచిగాని, మీరు చేసిన సాధనగాని ఊరికేపోదు, అది నాకు అక్కరలేదు. ఈ జన్మలో ఆ ఫలితం రాకపోయినా వచ్చేజన్మలో మీకే ఇచ్చేస్తాను. మీకు కోరిక ఉన్నా, కోరిక లేకపోయినా దేహప్రారబ్ధంలో ఉన్నది జరిగిపోతూ ఉంటుంది. అన్ని కోరికలు విడిచిపెట్టండి, మీ పని ఏదో మీరు చేసుకోండి. ఫలితం ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి ఆ కొలతలు అన్నీ భగవంతుడే చూసుకొంటాడు. మీరు కొలతలు మానేయండి, మీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయండి, ఆయన చేతిలో ఉన్న పనిని ఆయన చేస్తాడు. మీరు రోజుకు ఒక రకంగా, గంటకు ఒక రకంగా ఉంటున్నారు, ద్వంద్వాల నుండి మీరు బయటకు రండి. దేహం నేను అనుకొనే వాడికి సుఖం, దుఃఖం, చావు, పుట్టుక దేహంతో తాదాత్మ్యం లేనివాడికి ఏదీ లేదు. ఈ మూఢత్వంలో నుండి బయటకు రండి, అప్పుడు శాశ్వతమైన సుఖం, ఆనందం మీకు అనుభవంలోనికి వస్తుంది. ఆ సుఖాన్ని, శాంతిని అనుభవించేటప్పుడు స్వర్గానికి వెళ్ళాలనే తలంపు కూడా మీకు రాదు, అట్టిది ఆ సుఖం, ఆనందం. నీ దేహబుద్ధిలో నుండి, నీ మూఢత్వంలోనుండి విడుదలపొందితే ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు ఇప్పుడే ఇక్కడే ముగింపులేని ఆనందాన్ని, సుఖాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవచ్చు అని పరమాత్మ చెపుతున్నాడు.

మీరు ఇంటిదగ్గర మీ పని చేసుకొంటూ మిగతాసమయంలో విష్ణుసహస్రనామాలు చదువుకోవటం, భగవంతుడిని ధ్యానం చేయటం, ఇలా కొంత సాధన చేసుకొంటూ ఉంటే ఆ పని అయిపోతుంది, మీకు కొంత శక్తి కలుగుతుంది. ఆ శక్తిలోనుండి భక్తి కలుగుతుంది. భక్తిలో నుండి జ్ఞానం వస్తుంది, జ్ఞానంలో నుండి మోక్షం వస్తుంది. రెండు పనులూ అయిపోతాయి. ఒక్క పైసా కూడా ఖర్చు లేనిది జపయజ్ఞం. నిర్మలంగా మీరు నామాన్ని

చేసుకొంటూ ఉంటే మీ మనస్సు అణుగుతుంది, ఒక్క పైసా ఖర్చు లేదు. ఈ లోకంలో అనేక రకాల యజ్ఞాలు ఉన్నాయి, అందులో జపయజ్ఞాన్ని నేను అని పరమాత్మ చెప్పాడు. అసూయ ఉన్నవాడికి మిగిలేది అజ్ఞానం, అసూయలేనివాడికి జ్ఞానం. చమట పట్టే పనులు చేయనక్కరలేదు. నా మనస్సుకు ప్రీతికలిగే పనులు చెయ్యి అని పరమాత్మ అంటున్నాడు. నిరహంకారంగా, నిరాడంబరంగా, నిర్మలంగా జీవించండి. మీరు ఎవరితోనూ విరోధం పెట్టుకోవద్దు. మీరు వారి పద్ధతిలోనికి వెళితే మీకు జ్ఞానం రాదు అనుకొంటే బాహ్యంగా వారితో విరోధం పెట్టుకోకుండా ఎక్కడయినా కనిపిస్తే బాగున్నారా అంటే సరిపోతుంది, కాని మనస్సులో దూరంగా ఉండాలి. మనస్సులో ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయో చూసుకోండి. మన ద్వారా ఏదైనా మంచి జరగవచ్చు అది మీరు అనుకోవద్దు, భగవంతుడు మీ ద్వారా చేయించాడు, అంతే. కర్మ ఫలితాన్ని ఆశించకూడదు కదా అని ఒకరు భగవాన్‌ను అడిగితే నీవు కర్మ చేసిన చేయని వాడితో సమానంగా చేస్తే ఇంక ఫలితం గొడవ ఏమిటి? అంటున్నారు భగవాన్. గీతలో భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని జీవించండి.

మీ ఆదిని బట్టి మీరు బట్టలు కుట్టించుకొంటారు కదా అలాగే మీకు భగవంతుడు ఇచ్చిన అవకాశములను జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ జీవించండి కాని ఎదుటి వారిని అనుకరించవద్దు. ఇది బాగా గుర్తుపెట్టుకోండి. భగవంతుడు ఇచ్చిన దానితో సంతృప్తి పడండి. సంతృప్తి లేనివాడి ఆశను ఎవరూ తీర్చలేరు. మీరు ఎక్కడ ఉన్నా మనస్సులో నన్నే స్మరించుకోండి, నన్నే గమ్యంగా పెట్టుకొని జీవించండి, ఆత్మజ్ఞానం అంటే ఏదో అనుకొంటున్నావు నేనే అని పరమాత్మ చెపుతున్నాడు. మనం భగవంతుడిని పొందవచ్చు, పొందలేకపోవచ్చు అది వేరే విషయం, ఆయననే గమ్యంగా పెట్టుకొని జీవించేవారు మనలో ఎంతమంది ఉన్నారు. మనం భగవంతుడిపట్ల అకారణభక్తి కలిగిఉండాలి, అకారణభక్తి కలిగితే జ్ఞానం ఇస్తాడు. మనం మాట్లాడే మాటలకు చేసే పనులకు భగవంతుడు ఫలితం ఇస్తాడు. అందుచేత నీవు తింగరమాటలు మాట్లాడవద్దు, తింగరపనులు చేయవద్దు. అటువంటి మాటలు మాట్లాడుతూ ఉంటే, అటువంటి పనులు చేస్తూ ఉంటే వాటిని నీవు అనుభవించ వలసిందే. ప్రపంచంతో సంబంధం లేకుండా మనం బతకలేము అలాగని లోకంతో అతిగా ఉండకూడదు, అతిగా ఉంటే మన స్వరూపానికి దూరం అయిపోతాము. ఏ విషయాలు అయితే మనకు లోకం మీద మోహం కలుగజేస్తున్నాయో వాటిని తగ్గించుకొంటూ రావాలి. ఎలా తగ్గించుకొంటూ రావాలంటే మిమ్మల్ని చంపటానికి సాయంత్రం 6 గంటలకు ఎవరో

వస్తున్నారు అని మీకు తెలిసింది అనుకోండి మీరు ఎంత జాగ్రత్త పడతారో, మీ మనస్సును అంత జాగ్రత్తగా పెట్టుకొని లోకం మీద మోహం పోవటానికి అన్ని జాగ్రత్తలు తీసుకొంటే మీరు తరిస్తారు. తిరువణ్ణామలైలో కలరా ఉంది అంటే ముందే ఇంజక్షన్ చేయించు కొంటాము అలాగే పనికిరాని గొడవలు నీ మనస్సులోనికి రాకముందే జాగ్రత్త పడాలి. అన్నం తినకముందు ఎలా ఉన్నారో తిన్నతరువాత కూడా అలాగ ఉండాలి. అంటే అంత తేలికగా ఉండాలి. అలాగే పని చేసిన చేయనివాడిలాగ ఉండాలి, దాని వలన యోగివి అవుతావు. కర్తలేని కర్మ చేస్తే మనం పనిచేసిన చేయనివాడితో సమానము. మీ అందరికి తలో ఒక ఇల్లు ఉంది, భగవద్గీతే నా ఇల్లు అన్నాడు పరమాత్మ. ఈ భగవద్గీతకు నాకు తేడా ఏమీ లేదు అనిచెప్పాడు. గీతమొత్తం చదవకపోయినా, గీతలో ఒక్క శ్లోకం చాలు నిన్ను ఉద్ధరించటానికి సరిపోతుంది. శాస్త్రం అంతా చెప్పి నేను చెప్పినట్లు చెయ్యిఅని భగవంతుడు చెప్పలేదు, నీకు ఎలా బాగుంటే, ఎలా నచ్చితే అలాగ చేసుకో అని చెప్పాడు, అక్కడ స్వాతంత్ర్యం ఇచ్చాడు.

భగవద్గీతలో ఒక్కో శ్లోకం అధ్యయనం చేసి, దానిని మననం చేసి, దానిని మీ బుద్ధిలో తిప్పకోవాలి. భగవంతుని మాటలను వినగా వినగా, వాటిని మనస్సులో తిప్పకొంటూ ఉంటే పునర్జన్మను తీసుకొనివచ్చే వాసనలు పోతాయి. శ్రవణం, మననం వలన వివేకం పెరుగుతుంది, వైరాగ్యం పెరుగుతుంది. చాలామందికి వైరాగ్యం అంటే భయం. కృష్ణుడు ఒక మాట చెప్పాడు, చాలా అద్భుతమైన మాట. వైరాగ్యం తీసుకొని వచ్చే సుఖం ఏదీ తీసుకొని రాలేదు. వైరాగ్యమే నిజమైన సుఖం అన్నాడు. అర్జునా! నీ మొఖంలో ఎవరి మీద అసూయ కలగటం లేదు, నీవు అనసూయుడవు. ఈ ఒక్క గుణానికి లొంగిపోయి నీకు భగవద్గీతను చెపుతున్నాను, మహర్షులకు యోగులకు లభ్యం కాని నా విశ్వరూపాన్ని నీకు చూపిస్తున్నాను అన్నాడు పరమాత్మ, గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. మాటకు అందని అనుభవాన్ని మాటతో జాగ్రత్తగా పట్టుకొని, ఇతరులకు అర్థమయ్యేలా చెప్పాలి. చెప్పే పద్ధతిలో వినయం ఉండాలి, చెప్పేవాడు కనబడకూడదు, చెప్పే సబ్జక్టు మాత్రమే కనబడాలి, వినేవాడికి దానిమీద జిజ్ఞాస కలగాలి, నీవు ఏ స్థాయిలో ఉన్నావో ఆ స్థాయికి వారుకూడా ఎదిగేలా చేయాలి. మిమ్మల్ని మీరు ఎలా ప్రేమించు కొంటున్నారో వినేవారిని కూడా అంతగా ప్రేమించాలి. గీత చదవటం రాకపోతే మీ టేబుల్ మీద పెట్టుకొని రోజూ నమస్కారం పెట్టుకోండి. జఢత్వంలో నుండి, మూర్ఖత్వంలో నుండి మహావెలుతురులోనికి తీసుకొనివెళ్ళి, శాశ్వతమైన పదవిని ప్రసాదించేది ఈ గ్రంథము ఒక్కటి మాత్రమే.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-10-05, అన్నవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం మంచిపనులు చేయటం వలన మనస్సు, బుద్ధి బాగుపడతాయి. మనో నిగ్రహం కలుగుతుంది, బుద్ధికి స్పష్టత వస్తుంది, మనోనిగ్రహం వలన హృదయంలో ఉన్న నిజం మనకు తెలుస్తుంది. మంచి కర్మలు చేయటం వలన పుణ్యం వస్తుంది. అనుభవిస్తే పోతుంది. కర్మఫలం వలన పుణ్యం వస్తుంది అది శాశ్వతం కాదు. జ్ఞానఫలం మోక్షం అది శాశ్వతం. మనకు ధనం అవసరమే, కేవలం ధనం వలన మనం సుఖపడలేము. చదువు అవసరమే కేవలం చదువు వలన మాత్రమే మనం సుఖపడలేము. మనం మాట్లాడేమాట, చేసేపని, మనకు వచ్చే ఆలోచన బాగుండాలి. మన కుటుంబసభ్యులతో, సమాజంతో అనుబంధం శాంతియుతంగా ఉండాలి. ఆధ్యాత్మిక అంతస్థును మనం అడిగితే ఆయన ఇవ్వడు, మనం ఆయన దయకు పాత్రులమవ్వాలి. భగవంతుని దయలేకుండా ఆధ్యాత్మిక అంతస్థు మనకు రాదు. కృషి మనచేతిలో ఉంది. మన మనస్సులో మంచి ఆలోచనలు వస్తున్నాయి అనుకోండి, బుద్ధి వివేకవంతంగా ఉంది అనుకోండి, బుద్ధిలో స్పష్టత ఉంది అనుకోండి అప్పడు భగవంతుని దయ కలుగుతుంది, ఆధ్యాత్మిక అంతస్థు పెరుగుతుంది.

24 గంటలు మనం జపధ్యానములు చేయలేము. నారాయణసేవ చేయాలి. మనందరిలోను నారాయణుడు ఉన్నాడు. నరుడురూపంలో ఉన్నవాడు నారాయణుడే. ఇప్పుడు ఇక్కడ ఏర్పాటుచేసిన వాటర్‌స్కీమ్ నారాయణ సేవే. మనం జీవితంలో ఒకటి నేర్చుకోవాలి. అందరికి మంచిపనులు చేసే అవకాశం ఉండదు, కాని మంచిపనులు చేసే వారిని గౌరవించటం నేర్చుకోవాలి. రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే ఎవరైనా ఒక మంచి పని చేస్తే 100కి 80 మందికి మెచ్చుకొనే స్వభావం ఉండదు, ఏదో చేసారులెండి అంటాను దీనికి అసూయ కారణం. అంటే 100కి 80 మంది విమర్శించేవారు ఉంటారు. మిగిలిన 20 మందిలో 19 మంది మంచిపనులు చేయలేకపోయినా చూసి సంతోషిస్తారు, వారు అసూయరహితులు. ఇంక ఒక్కడు ఉన్నాడు వాడు మీకు ఏదైనా సహకరిస్తే సహకరించ వచ్చు, లేకపోతే లేదు. అలాగని మీరు నిస్పృహ చెందకుండా, నిరాశకు గురికాకుండా ముందుకు వెళ్ళండి, మీరు చేసే మంచిపనిని విడిచిపెట్టవద్దు. మీకు సహకారం లేకపోయినా ధైర్యంతో, సహృదయంతో మంచిపనిని తలపెట్టారు అనుకోండి, అది కాలప్రవాహంలో సక్సెస్ అవుతుంది. మీరు ఒక మంచిపని చేయండి, మంచిమాట మాట్లాడండి, మీకు ఒక మంచి

ఆలోచన రానివ్వండి. ఇవి మీరు మర్చిపోయినా భగవంతుడు గుర్తుపెట్టుకొంటాడు, మిమ్మల్ని జ్ఞానంతో అలంకరిస్తాడు. కర్మను త్యాగం చేసినవాడికి జ్ఞానం రాదు, కర్మఫలం త్యాగం చేసినవాడికి జ్ఞానం కలుగుతుంది. త్యాగి కానివాడు జ్ఞానికాలేడు, సుఖి కాలేడు. మీరు గృహస్థాశ్రమంలో ఉండండి. ఒక చేతితో ఇంటిదగ్గర పనులు చేసుకోండి, రెండో చేతితో భగవంతుని పాదాలను పట్టుకోండి.

ధనం ఉన్నచోట గర్వం ఉంటుంది. గర్వం ఉన్నవాడు హృదయం యొక్క లోతులలోనికి వెళ్లలేడు. మీరు కొంత స్వార్థం తగ్గించుకొంటే సమాజానికి ఎన్నో మంచి పనులు చేయవచ్చు. మీకు 100 రూపాయలు ఆదాయం వస్తూ ఉంటే అందులో 10 రూపాయలు సమాజానికి ఉపయోగిస్తే సమాజానికి ఎంతో మంచి జరుగుతుంది. కులం అనేది ఒక సాంఘిక వ్యవస్థ, మతం అనేది ఒక జీవిత విధానం. మనం ఏ రకంగా జీవిస్తే సుఖపడతామో, ఏ రకంగా జీవిస్తే దుఃఖంలేనిస్థితిని పొందుతామో ఇది అంతా మతంలో చెప్తారు. కాని పరిస్థితులు ఎలావచ్చాయి అంటే మతాన్ని సరిగా అర్థం చేసుకోవటం మానివేసి మతం పేరుమీద, కులాల పేరుమీద సమాజాన్ని విభజిస్తున్నారు, అది దురదృష్టకరం. ధర్మయుక్తంగా ఉన్న అర్థంకాని, కోరికకాని మోక్షానికి నీకు అడ్డురావు. మీ సంపాదన ధర్మానికి అనుగుణంగా ఉండాలి. కాని దురదృష్టం ఏమిటి అంటే ఏమీ కష్టపడకూడదు, కోట్లు సంపాదించేయాలి అనుకొంటున్నారు, ఈ రకమైన ఆలోచన ఆ వ్యక్తికి మంచిది కాదు, సమాజానికి మంచిది కాదు. మన డబ్బు మనలను సుఖపెట్టాలి గాని దుఃఖపెట్ట కూడదు. రోజూ కొంతసేపు ఏకాంతంగా ఉండాలి. అప్పుడు మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని చూసుకోవాలి, మనం రాంగ్ డైరెక్షన్‌లో ఉన్నామో, రైట్ డైరెక్షన్‌లో ఉన్నామో చూసుకోవాలి. మీలో కొంతమంది ఆర్థికంగా, సాంఘికంగా బాగుండవచ్చు కాని ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. దాని వలన గర్వం రాకుండా చూసుకోండి. ప్రాణప్రయాణ సమయంలో ఎవడైతే నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఉన్నాడో వాడికి పునర్జన్మ లేదు. మనం ఎన్ని జన్మలు ప్రయత్నం చేస్తే నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉండగలము. ఒకసారి మైత్రేయ మహర్షి ధృతరాష్ట్రునికి బోధిస్తున్నాడు, ధుర్యోధనుడు అక్కడకు వచ్చి కూర్చున్నాడు. ధుర్యోధనా పాండవులతో నీకు ఎందుకు పేచీలు, వారి వాటా వారికి ఇచ్చేయి, సుఖంగా బ్రతకండి అని మైత్రేయమహర్షి చెప్పాడు. ధుర్యోధనుడికి నేను రాజును, అంగబలం ఉంది అని గర్వం ఉంది. మైత్రేయమహర్షి వంక చూస్తూ రెండు చేతులతో రెండు తొడలు

కొట్టుకొంటూ నేనా పాండవులతో రాజీపడటం, వారిని సంహరిస్తాను అన్నాడు. అప్పుడు మైత్రేయమహర్షి అంటాడు నీ రెండు తొడలను భీముడు మోది చంపుతాడు అని చెప్పాడు, అక్షరాల ఆ మాటలు జరిగాయి. వాడి తొడలు పగిలిపోయి చనిపోతాడు అని శాపం పెడుతున్నావు, నువ్వు శాపం ఉపసంహరించుకో అని ధృతరాష్ట్రుడు అంటాడు. నీ కుమారుడికి సద్బుద్ధి కలిగితే నా శాపం వర్తించదు, సద్బుద్ధి కలుగదు అనుకో నా మాట అక్షరాలా జరిగి తీరుతుంది అని మైత్రేయమహర్షి చెప్పాడు.

మనం ఈ లోకంలో ఉండగానే పరలోకానికి వెళ్ళే బ్రిడ్జిని నిర్మించుకోవాలి. మన ఆలోచనలు, తలంపులు, కోరికలు ఇవన్నీ మన కూడా రాబోయే జన్మకు వచ్చేస్తాయి, అందుచేత మన జీవితవిధానం జాగ్రత్తగా చూసుకోవాలి. మనం ఏదైనా పనిచేస్తే అది ఇహానికి, పరానికి ఉపయోగపడాలి. ఎవరైనా మన దగ్గరకు సలహాకు వస్తే మనం రాగద్వేషాలు లేకుండా, ఎలా చెపితే వారు బాగుపడతారో హృదయపూర్వకంగా చెపితే దానివలన కూడా మీకు స్పిరిట్యువల్ స్టేటస్ పెరుగుతుంది. ఎవరి హృదయం అయితే ఖాళీ అయ్యిందో వారినే భగవంతుడు ఉపయోగించుకొని వారి ద్వారా సత్కర్మలు చేయిస్తాడు. భగవద్గీత, ఉపనిషత్‌లు చదివేస్తున్నారు అనుకోండి దానివలన కొంత తెలివితేటలు పెరగవచ్చు, సత్కర్మలు చేయకపోతే హృదయం విశాలం అవద్దు, బుద్ధి విశాలం అవద్దు. అందరూ సాధన చేస్తున్నారు. ఇక్కడ కూర్చున్నవారు భక్తులే కాదు అని నేను అనటం లేదు కాని ఆ భక్తి ఫలించటం లేదు, దానికి కారణం మనకు వైరాగ్యం బహుతక్కువ ఉంది. వైరాగ్యం లేకుండా ఆత్మజ్ఞానం రాదు. నీకు భయం ఉంది అనుకో, మనిషి కూడా నీడ వచ్చినట్లుగా భయం కూడా దుఃఖం వచ్చేస్తుంది. ప్రతీదానికి కోపం వస్తూ ఉంటే వారికి బుద్ధిసూక్ష్మత లేదు అని అర్థం. హెచ్చుతగ్గులు ఉన్న మనిషి సుఖపడడు. సమానబుద్ధి లేనివాడు మోక్షాన్ని పొందలేడు. ఎప్పటికప్పుడు తన బుద్ధిని ఎవడైతే బేలెన్స్ చేసుకొంటున్నాడో వాడు నా దయకు పాత్రుడవుతాడు అని భగవంతుడు చెపుతున్నాడు. మీరందరు ఇక్కడ కూర్చున్నారు. మీ ఇంటి దగ్గర నుండి ఏదైనా మంచి వార్త వచ్చింది అనుకోండి. మంచి వార్తరాకముందు ఎలాగ ఉన్నారో, మంచి వార్త విన్నాక కూడా అలాగే ఉండాలి. మీకు ఏదైనా చెడు వార్త వచ్చినా ఆ చెడువార్త వినకముందు ఎలా ఉన్నారో విన్న తరువాత కూడా అంత నిర్మలంగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుడిని మీరు వరించటం కాదు, ఈశ్వరుడే వచ్చి మిమ్మల్ని వరిస్తాడు. సమానబుద్ధి ఉన్నవాడికి ఈశ్వరుడు అన్నీ ఇచ్చి మోక్షాన్ని కూడా ఇస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 05-01-06 | గురు | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| 08-01-06 | ఆది | చించినాడ గీతామందిరం |
| 14-01-06 | శని | ఏలూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానం, రామారావుపేట |
| 21-01-06 | శని | మలికిపురం సాయిబాబా మందిరం |
| 26-01-06 | గురు | తాడినాడ |
| 30-01-06 | సోమ | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## స్వచ్ఛంగా లేని వాడు - స్వేచ్ఛగా ఉండలేడు

పుట్టిన లగాయతు చనిపోయే నిమిషం వరకూ మనస్సు ఏదో సంకుచిత మార్గంలో నేను - నాది అనే మూసలో తయారవుతున్నప్పుడు మనం స్వేచ్ఛగా ఎలా ఉండగలం. లక్షలాది జన్మలనుంచి కులం, మతం, ఆచారం, ఆర్థిక ఒత్తిడి, కుటుంబం, స్నేహాలు, అనుభవాలు ఇలా ఎన్నోరకాల ప్రలోభాలకు లోనైపోయాము. ఎంత జ్ఞానదృష్టి కలిగినా, ఎన్ని మంచి సంకల్పాలు చేసుకొన్నా స్నేహభావంతో, పరిశుద్ధంగా జీవితాన్ని గడుపుతున్నా మనోమాలిన్యం పోదు, మనస్సులో చెడ్డ ఊహాలు "మేము ఉన్నాము సుమా!" అని పలకరిస్తూనే ఉంటాయి. స్వచ్ఛత రానంతకాలం మనిషి పతనమయ్యే పరిస్థితి నీడలా వెంటాడుతూనే ఉంటుంది. మనిషి పాప ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. అధోగతిలోనే ఉంటాడు. మనస్సు ఎల్లప్పుడు కోటానుకోట్ల అనంత కర్మరూప తరంగాలతో అల్లకల్లోలమై ఉంటుంది. మనస్సును వృత్తి రహితమొనర్చి స్వేచ్ఛగా ఉంచుకోవాలి, మనమేదైనా పాపం, తప్పుచేసి మనస్సులో కల్మషం పెట్టుకొంటే నరమాత్రుడు చూడలేదని, రవ్వంత కనపడని అవకాశం లేని రహస్య ప్రదేశంలో మనం ఒక దోషం నాటితే అనివార్యమైన అతి బలీయమైన ప్రకృతి ధర్మంచేత మనం విత్తిన పాపానికి ప్రతిఫలంగా బాధ, దుఃఖం అనుభవించక తప్పదు. పాపం యొక్క ప్రతిఫలమే మరణ వేదన. మనం ప్రకృతిని, పరమేశ్వరుని మోసం చెయ్యలేము. ఇది సత్యం, ధర్మం. తన కష్టాల యొక్క నిజమైన కారణం తెలుసుకోలేనివాళ్ళు పరిస్థితులపై నిందలు మోపుతారు, ప్రక్క వాతావరణంతో పోరాటం సాగిస్తారు. బంధువులపైన, మిత్రులపైన ఫిర్యాదులు చేయటం ప్రారంభిస్తారు. అన్నిచోట్ల చెప్పవలసిన దైవ ధర్మం ఒక్కటే ఉంది "భగవంతుని కళ్లలో దుమ్ము కొట్టటానికి ప్రయత్నం చేస్తే మనమే గుడ్డివారమౌతాము. ఆ పాప ఫలితం లక్షణాలు అసూయత, దురాశ, దౌర్జన్యం, అసహనం, ఆదుర్దాలు నిరాశలతో ఉంటుంది. అప్పడప్పడు తళుక్కున సంతోషం, అనురాగం వెలుగుతూఉంటుంది. అసహ్యం, భయం, పెద్దమనిషి తరహా ఇవి అన్నీ విచిత్రంగా కలసిపోతాయి. హింస, శాంతి రెండూ మనలోనే మూర్తీభవించి ఉన్నాయి. శాంతిని మనం పెంపొందించుకొంటే స్వేచ్ఛగా సుఖంగా ఉంటాము. అలా ఉండలేకపోతే ఆ మనస్సును తడబాటు లేకుండా పూర్తిగా గురువుకు అర్పిస్తే దాన్ని బాగుచేసి స్వేచ్ఛను ఇస్తారు. ఇది నిజం. నిజం. నిజం.

**– సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం



విజయనగరం మెడికల్
కాలేజ్ చైర్మన్ శ్రీ అల్లూరి
మూర్తిరాజుగారితో
సద్గురు శ్రీనాన్నగారు



ది॥ 13-12-05 అరుణాచలంలో శ్రీ నాన్నగారి
ఆశ్రమ ఆవరణలో అరుణాచల దీపాన్ని ప్రజ్వలన
చేసిన హైదరాబాదు కుకట్‌పల్లి వాస్తవ్యులు శ్రీ
పి. రామకృష్ణం రాజు దంపతులు

